ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

అన్నమయ్య

జిల్లా వార్తలు

5

గురువారం 4 సెప్టెంబరు 2025





నారాయణరెడ్డిగారిపల్లె జగనన్న కాలనీలో తీసిన పునాదులు

ఇంజక్షన్‌తో పేయదూడల జననం

● లింగ నిర్ధారణ వీర్యనాళికలు రైతులకు ఉపయోగం

● పశు సంవర్ధక శాఖ డీడీ శ్రీనివాస్ నాయుడు

ఫటాఫట్



శ్రీనివాస్ నాయుడు, పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్, మదనపల్లె

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతులను ఆదుకునేందుకు ఆవులకు వేసే లింగ నిర్ధారణ వీర్య నాళికల ఇంజక్షన్‌తో ఎక్కువగా పేయదూడలే పుట్టేలా చర్యలు తీసుకుంటోంది. పాడి రైతులకు ఎంతో ఉపయోగపడే ఈ పథకంలో ఇప్పుడు తక్కువ ఖర్చుతోనే ఇంజక్షన్‌లు దొరుకుతున్నాయి. మదనపల్లె డివిజన్‌లో పశు సంవర్ధకశాఖ అందిస్తున్న సేవలపై ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ నాయుడుతో ఇంటర్వ్యూ..

ప్రశ్న: లింగ నిర్ధారణ వీర్య నాళికలతో పాడి రైతులకు ఉపయోగమేనా?

జవాబు: ఆవులకు ఇచ్చే లింగ నిర్ధారణ వీర్య నాళికలతో 90 శాతం పేయ దూడలే పుడతాయి. గతంలో రూ.500కు రెండుసార్లు ఇంజక్షన్‌లు వేసేవారు. ఇప్పుడు కేవలం రూ.150కే వేస్తున్నాం. మండలానికి 2,500 ఆవులకు చొప్పున 12 మండలాల్లో ఈ పథకాన్ని అమలు చేస్తున్నాం.

ప్రశ్న: బ్లాంకెట్ సర్వే ఎంత వరకు వచ్చింది?

జవాబు: డివిజన్‌లో బ్లాంకెట్ సర్వే 99 శాతం పూర్తయింది. పశువులను పెంచే రైతులకు సంబంధించి 14 అంశాల గురించి 332 మంది తమ సిబ్బంది సర్వే చేస్తున్నారు. ఈనెల 15వ తేదీకి 100 శాతం బ్లాంకెట్ సర్వే పూర్తి చేస్తాం.

ప్రశ్న: వర్షాకాలంలో పాడి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏవి?

జవాబు: వర్షాకాలంలో పాడి రైతులు పలు జాగ్రత్తలు తీసుకోవాల్సిందే. ముఖ్యంగా ఎత్తయిన ప్రదేశాల్లో ఆవులు షెడ్లు ఉండేలా చర్యలు తీసుకోవాలి. మూడు నెలలకు సరిపోయేంత ఎండు గడ్డి నిల్వ చేసుకోవాలి. నీళ్లలో ఉండే గడ్డిని పశువులు మేస్తే జలగ వ్యాధి వస్తుంది. దీనికి బదులుగా పశువులకు డీవార్మింగ్ చేయించాలి.

ప్రశ్న: పశువులు ప్రమాదాల్లో మృతి చెందితే..?

జవాబు: వర్షాకాలంలో పశువులను విద్యుత్ స్తంభాల వద్ద కట్టేయకూడదు. విద్యుత్ తీగలు తెగి పడిపోయినా, స్టే వైర్లలో విద్యుత్ సరఫరాతో పశువులు ప్రమాదవశాత్తు మృతి చెందితే, ఎస్పీడీసీఎల్ అధికారులకు తెలియజేయాలి. పిడుగుపాటుకు పశువులు మృతి చెందినా, పాడుపడిన ఇళ్ల వద్ద పశువులు మృతి చెందినా, ఇన్సూరెన్స్ చేయించిన వాటికి తప్పకుండా నష్టపరిహారం వస్తుంది.

ప్రశ్న: ఉచిత పశు వైద్యశిబిరాలు రైతులకు ఉపయోగపడుతున్నాయా?


జవాబు: ప్రతి వారం ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నాం. దూడలకు నట్టల నివారణ మందు పిచికారీ చేయిస్తున్నాం. ఆవులకు గర్భకోశవ్యాధులు గుర్తించి చికిత్సలు అందిస్తున్నాం. గర్భధారణ పరీక్షలు, వ్యాధులకు చికిత్సలు చేస్తున్నాం. ముఖ్యంగా గాలికుంటు వ్యాధి, ముద్దచర్మం వ్యాధి పశువులకు ప్రాణాంతకం, వీటిపై రైతులకు అవగాహన కల్పించి ముందస్తుగా టీకాలు వేస్తున్నాం.

ప్రశ్న: 1962 పథకం సక్రమంగా అమలవుతోందా?

జవాబు: నియోజకవర్గానికి రెండు సంచార పశువైద్య రథాలు అందుబాటులో ఉన్నాయి. 1962 టోల్‌ఫ్రీ నెంబర్‌కు రైతులు ఫోన్ చేస్తూనే, ఈ వాహనంలోని పశువుల వైద్యుడు, సిబ్బంది గ్రామాలకు వెళ్లి పశువులకు చికిత్స చేస్తారు. అత్యవసరమైన పశువులను ఈ వాహనంలోనే పశువుల ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తారు.



పునాదులకే పరిమితమైన రాయచోటి మండలం పెమ్మాడపల్లి జగనన్న కాలనీ



ఇంకెన్నాళ్లు...!

● సమస్యల లోగిళ్లు... జగనన్న కాలనీలు

● అనువు గాని చోట ఇంటి పట్టాలు

● మూడేళ్లుగా ముందుకు సాగని నిర్మాణాలు

● పునాదులకే పరిమితమైన 18,233 గృహాలు

● నిర్మాణం మొదలు కాని 9482 గృహాలు

● ఇదీ జిల్లాలో జగనన్న కాలనీల దుస్థితి

రాయచోటిటౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఇళ్లను కాదు ఊర్లనే నిర్మిస్తున్నామంటూ డప్పు కొట్టుకున్న వైసీపీ ప్రభుత్వం చేసిన నిర్వాకానికి ఊర్లెమో కానీ ఆ కాలనీల్లో ఇళ్లే కనిపించడం లేదు. ఇళ్ల నిర్మాణాలకు అనువు కాని కొండలు, గుట్టల్లో ఇళ్ల స్థలాలు కేటాయించడంతో అక్కడ లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు చేపట్టలేక నేటికీ జిల్లాలో 18,233 గృహాలు పునాదులకే పరిమితమై దర్శనమిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా 79,733 మంది పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వగా మూడు సంవత్సరాల కాలంలో ఇప్పటి వరకు 40,124 ఇళ్ల మాత్రమే పూర్తయ్యాయి. ఇంకా 9842 ఇళ్ల నిర్మాణం మొదలుకాకపోవడంతో పాటు 1983 ఇళ్ల నిర్మాణానికి గుంతలు తీసి వదిలేశారు. అలాగే 18,233 ఇళ్లు పునాదుల వరకే, 5785 గృహాలు గోడలకే పరిమితమయ్యాయి. అలాగే 1126 గృహాలు మోల్డింగ్ వేసి అలాగే వదిలేయగా మొత్తం జిల్లా వ్యాప్తంగా 25,144 గృహాలు నేటికీ అసంపూర్తిగానే మిగిలిపోయాయి.

రాయచోటి నియోజకవర్గానికి 19,147 మంజూరు కాగా ఇప్పటి వరకు 9119 మాత్రమే పూర్తయ్యాయి. ఇంకా 7466 నిర్మాణాలు అసంపూర్తిగానే ఉన్నాయి. పీలేరు నియోజకవర్గానికి 11,956 మంజూరు కాగా అందులో 7067 మాత్రమే పూర్తి కాగా ఇంకా 4202 ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. రాజంపేట నియోజకవర్గానికి 10,764 ఇళ్ల మంజూరు కాగా 4947 మాత్రమే పూర్తి కాగా 3644 ఇళ్ల అసంపూర్తిగానే ఉన్నట్లు హౌసింగ్ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. కోడూరు నియోజకవర్గానికి 6559 ఇళ్లు మంజూరు కాగా 3265 మాత్రమే పూర్తి చేయగా ఇంకా 1225 అసంపూర్తిగా ఉన్నాయి. తంబళ్లపల్లె నియోజకవర్గానికి 13,136 మంజూరు కాగా అందులో 7080 పూర్తి కాగా 3071 అసంపూర్తిగా ఉన్నాయి. మదనపల్లె నియోజకవర్గానికి 15,171 మంజూరు కాగా అందులో 8646 పూర్తి కాగా ఇంకా 5536 నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి.



నారాయణరెడ్డిగారిపల్లెకు సమీపంలోని జగనన్న కాలనీ మధ్యలో ఉన్న గుట్ట

రాయచోటి మండల పరిధిలోని పెమ్మాడపల్లె గ్రామం గరుగుపల్లి సమీపంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలో 200 గృహాల వరకు లబ్ధిదారులకు ఇంటి పట్టాలు ఇచ్చినప్పటికీ అందులో కేవలం రెండు, మూడు గృహాలు మాత్రమే నిర్మాణాలు పూర్తయి మిగిలినవన్నీ పునాదులకే పరిమితమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా చాలాచోట్ల జగనన్న కాలనీలు ఊరు బయట ఎక్కడో దూరంగా గుట్టలు, వంకలు, వాగుల్లో మంజూరు చేయడంతో చాలామంది నిర్మాణాలు చేపట్టేందుకు సుముఖత చూపకపోవడంతో ఊర్లు నిర్మిస్తున్నామన్న వైసీపీ నేతల మాటలు నీటి మూటలయ్యాయి. దీనికి తోడు కొన్ని చోట్ల నిర్మాణాలు పూర్తయినా గత ప్రభుత్వం ఆ కాలనీలకు విద్యుత్ సౌకర్యం, లేక నీటి సౌకర్యం కల్పించకపోవడంతో చాలా మంది లబ్ధిదారులు నిర్మాణాలు ప్రారంభించి మధ్యలోనే వదిలేసి అద్దె గృహాల్లో కాలం గడుపుతున్నారు.

రాయచోటి మున్సిపాలిటీలో అద్దె భవనాల్లో కాలం గడుపుతున్న ఎంతో మంది పేదలకు పట్టణ పరిధిలోని నారాయణరెడ్డిగారిపల్లెకు సమీపంలో సుమారు 7 వేల గృహాలతో జగనన్న కాలనీలను ఏర్పాటు చేశారు. అయితే అక్కడ కూడా సరైన సౌకర్యాలు లేకపోవడంతో ఇప్పటి వరకు 3 వేల గృహాలకుపైగా ఇంకా నిర్మాణాలు చేపట్టలేదు. ఇదిలా ఉండగా కూటమి ప్రభుత్వం హౌసింగ్ కాలనీల్లో నిర్మాణాలను పూర్తి చేసేందుకు ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు అదనపు సాయం కింద 50 వేల నుంచి 70 వేల వరకు ఇంటి నిర్మాణాలకు ఇస్తామని చెప్పినప్పటికీ గత ప్రభుత్వం ఇచ్చిన కాలనీల్లో నిర్మాణాలు చేపట్టేందుకు లబ్ధిదారులు ముందుకు రాకపోవడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా అక్కడక్కడా నిర్మాణాలు పూర్తి చేసిన జగనన్న కాలనీల్లో విద్యుత్ సౌకర్యం లేక, నీటిసౌకర్యం లేక లబ్ధిదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల ప్రైవేటు బోర్ల నుంచి ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసే పరిస్థితులు ఉన్నాయి. కూటమి ప్రభుత్వంలోనైనా హౌసింగ్ కాలనీలకు మోక్షం కలుగుతుందన్న కొండంత ఆశతో లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు.

నిర్మాణాలు పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం

జిల్లా వ్యాప్తంగా హౌసింగ్ కాలనీలో నిర్మాణాలను పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం. హౌసింగ్ శాఖ ద్వారా సిబ్బందితో కలిసి లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తూ సమావేశం నిర్వహిస్తున్నాం. నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసేందుకు ఇప్పటికే ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపడుతోంది.కాలనీలో ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు అవసరమైన విద్యుత్ సౌకర్యం కల్పించాం. నీటి సౌకర్యం కూడా అందుబాటులో ఉంది. సొంత జాగాలో ఇళ్ల నిర్మాణం చేపట్టేవాళ్లు నిర్మాణాలు వేగంగా సాగిస్తున్నారు. హౌసింగ్ కాలనీలో చాలా చోట్ల చాలామంది లబ్ధిదారులు నిర్మాణాలకు ముందుకు రావడం లేదు. ఇప్పుడిప్పుడే ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి.

- రమేశ్‌రెడ్డి, హౌసింగ్ పీడీ

యూరియా నిల్వలపై జేసీ ఆకస్మిక తనిఖీ

రాయచోటి (నేతాజీ సర్కిల్), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రం, ప్రైవేటు ఫెర్టిలైజర్ షాపుల్లో యూరియా నిల్వలపై జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ బుధవారం తనిఖీలు చేశారు. చెన్నముక్కపల్లె-2 రైతుసేవా కేంద్రంలో యూరియా స్టాక్‌ను పరిశీలించారు. వ్యవసాయాధికారులకు తగు సూచనలు జారీ చేశారు. అనంతరం ఆయన రాయచోటి తహసీల్దార్ నరసింహకుమార్‌తో కలిసి రాయచోటిలోని జాఫర్‌సాబ్ ఫెర్టిలైజర్ షాపులో రిజిస్టర్లను తనిఖీ చేశారు. దిగువ అబ్బవరంలో స్వామిత్ర సర్వే కార్యక్రమాన్ని పరిశీలించి మండల సర్వేయర్, పంచాయతీ సెక్రటరీలకు సూచనలిచ్చారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

12 మంది సర్పంచ్‌ల చెక్‌పవర్ రద్దు

● వైసీపీ పాలనలో రూ.లక్షల నిధులు దుర్వినియోగం

కడప రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట మండలంలోని 12 గ్రామ పంచాయతీల సర్పంచ్‌ల చెక్‌పవర్‌ను రద్దు చేస్తూ బుధవారం పంచాయతీశాఖ జిల్లా అధికారి జి.రాజ్యలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. చెక్‌పవర్‌ను డిప్యూటీ ఎంపీడీవోకు తాత్కాలికంగా అందజేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఒంటిమిట్ట మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో రూ.లక్షల మేర 15వ ఆర్థిక సంఘం నిధులతో పాటు, సాధారణ నిధులు దుర్వినియోగం జరిగినట్లు ఆంధ్రజ్యోతి దినపత్రికలో కథనాలు వెలువడ్డాయి. మండలంలో మొత్తం 13 గ్రామ పంచాయతీలకు గాను గొల్లపల్లి, సాలాబాద్, ఒంటిమిట్ట, మంటపంపల్లి, నర్వకాటిపల్లి, పెన్నపేరూరు, కోనరాజుపల్లి, కొత్తమాధవరం, రాచగుడిపల్లి, చింతరాజుపల్లి, నడింపల్లి, గంగపేరూరు తదితర 12 గ్రామ పంచాయతీల్లో పెద్దఎత్తున నిధుల దుర్వినియోగం జరిగినట్లు గుర్తించారు. ఈ మేరకు ఏపీ పీఆర్ చట్టంలోని సెక్షన్ 42(1) కింద ఆయా గ్రామ పంచాయతీ సర్పంచ్‌ల చెక్‌పవర్‌ను రద్దు చేశారు.

మొబైల్ ఆధార్ క్యాంపు

● కలెక్టర్ చామకూరి శ్రీధర్



అప్డేట్ చేసిన ఆధార్ ఫారాన్ని చిన్నారికి అందజేస్తున్న కలెక్టర్

రాయచోటి (నేతాజీ సర్కిల్), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మొబైల్ ఆధార్ క్యాంపులను కలెక్టర్ చామకూరి శ్రీధర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గిరిజన జనాభా ఎక్కువగా ఉన్న మండలాల్లో మొబైల్ ఆధార్ క్యాంపులు నిర్వహించాలని తెలిపారు. మండలంలోని సచివాలయంలో క్యాంపులు జరుగుతాయని తెలియజేశారు. క్యాంపుల్లో ఆధార్‌కార్డు లేని వారి కోసం నూతన కార్డు కోసం ఎన్‌రోల్‌మెంట్, ఆధార్‌కార్డులో మార్పులు, బయోమెట్రిక్ అప్డేట్ తదితర సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ సేవలను గిరిజన ప్రజలు వినియోగించుకోవాలని తెలిపారు. మొబైల్ ఆధార్ క్యాంపును ప్రారంభించిన అనంతరం చిన్నారికి సంబంధించిన ఆధార్ అప్డేట్ చేసి సంబంధిత ఫారాన్ని వారికి కలెక్టర్ అందజేశారు.

జనరల్ బార్లకు దరఖాస్తు చేసుకోండి

రాయచోటిటౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏర్పాటు చేయదలచిన 3 జనరల్ బార్లకు దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ అధికారి మధుసూదన్ బుధవారం తెలిపారు. రాయచోటిలో 1, మదనపల్లిలో 1, పీలేరులో 1 బార్‌కు ఈనెల 14వ తేదీ సాయంత్రం 6 గంటలలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆయా బార్లకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన అనంతరం ఈనెల 15వ తేదీ ఉదయం 8 గంటలకు కలెక్టర్ కార్యాలయంలో గల పీజీఆర్ఎస్ హాల్‌లో డ్రా తీసి బార్లను కేటాయిస్తామని తెలిపారు. దరఖాస్తు చేయదలచిన వారు రూ.5 లక్షలు బ్యాంక్ డీడీ తీసుకుని కడప రోడ్డులో గల జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన చెప్పారు.

ముగ్గురికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు

రాయచోటిలో తెలుగు పండిట్ ఉత్తన్న ● కేవీ పల్లె ప్రధానోపాధ్యాయురాలు సరస్వతి ● గుడిసివారిపల్లె ప్రధానోపాధ్యాయుడు సిద్దారెడ్డి



మోటపోతుల ఉత్తన్న



సరస్వతి



సిద్దారెడ్డి

రాయచోటి (నేతాజీ సర్కిల్)/పీలేరు/పెద్దమండ్యం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు రాయచోటి మాసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన (స్కూల్ అసిస్టెంట్ తెలుగు) తెలుగు పండిట్ మోటపోతుల ఉత్తన్న ఎంపికయ్యారు. ఈనెల 5వ తేదీ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విజయవాడలోని లయోలా ఇంజనీరింగ్ కాలేజిలో అవార్డు అందుకోనున్నారు. ఈయన స్వగ్రామం రాయచోటి మండలం మాసాపేట గ్రామం ఆవులవాండ్లపల్లె. 11-11-1989లో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా ఉపాధ్యాయ వృత్తిలో చేరారు. అనంతరం వివిధ పాఠశాలల్లో పనిచేసి 2009లో స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొంది మట్లి పెద్దూరు హైస్కూల్‌లో చేరారు. 2017 నుంచి ఇప్పటి వరకు రాయచోటి మాసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు పండితుడిగా పనిచేస్తున్నారు. ఈయన గతంలో 2013, 2022లలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, 2014లో రాజంపేటలో ఆకేపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెస్ట్ టీచర్ అవార్డు అందుకున్నట్లు తెలిపారు. 2022లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం సంతోషంగా ఉందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు.

కేవీపల్లె ప్రధానోపాధ్యాయురాలు సరస్వతి

పీలేరు నియోజకవర్గంలోని కేవీ పల్లె మండలం జి.కొత్తపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తున్న వి.సరస్వతి రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. ప్రస్తుతం జి.కొత్తపల్లెలో గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తున్న సరస్వతి ఉపాధ్యాయ వృత్తిలో గత 24 ఏళ్లుగా సేవలందిస్తున్నారు. సైన్స్ (బయాలజీ) ఉపాధ్యాయురాలిగా ఉద్యోగ జీవితం ప్రారంభించిన ఆమె ఆరేళ్ల క్రితం ప్రధానోపాధ్యాయురాలిగా పదోన్నతి పొందారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'లీప్' యాప్ ద్వారా ఆమె సేవలను గుర్తించి విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆమెను ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను దరఖాస్తు చేసుకోకపోయినా ఉన్నతాధికారులు తన పనితీరును గుర్తించి అవార్డుకు ఎంపిక చేయడం సంతోషంగా ఉందన్నారు. కలకడ మండలం బాటవారిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలకు అందించిన సేవలకు గాను తాను అవార్డుకు ఎంపికైనట్లు ఆమె వివరించారు. ఆమెను పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

గుడిసివారిపల్లె ప్రధానోపాధ్యాయుడు సిద్దారెడ్డి

పెద్దమండ్యం మండలానికి చెందిన ప్రధానోపాధ్యాయుడు ఆర్.సిద్దారెడ్డి రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డుకు ఎంపికైనట్లు బుధవారం పెద్దమండ్యం ఎంఈవో మనోహర్ తెలిపారు. మండలంలోని పాపేపల్లి పంచాయతీ గుడిసివారిపల్లి ఆదర్శ పాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆర్.సిద్దారెడ్డి 2000 సంవత్సరంలో ఉపాధ్యాయ వృత్తిలో చేరి ప్రతి పాఠశాలలో విద్యార్థులు, పాఠశాలల విద్యాభివృద్ధి ఆయన వంతు కృషి చేశారు. గతంలో ఆయన మండల, జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. సిద్దారెడ్డి ఎంపిక కావడంతో ఎంఈవోతో పాటు మండలంలోని ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

● కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (నేతాజీ సర్కిల్), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైతులకు గ్రామ స్థాయిలో యూరియాపై సమాచారాన్ని అందుబాటులో ఉంచాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం అమరావతిలోని సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో ఎరువులపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ హాజరయ్యారు. అనంతరం కలెక్టర్ జిల్లా వ్యవసాయశాఖ, మార్కెటింగ్ శాఖాధికారులనుద్దేశించి మాట్లాడుతూ జిల్లాలో యూరియాపై ఉన్న దుష్ప్రచారాన్ని అరికట్టాలని ఆదేశించారు. వ్యవసాయ మార్కెటింగ్ శాఖల మండల, గ్రామ స్థాయి సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తగిన ఆదేశాలు జారీ చేయాలని ఆదేశించారు. యూరియా సమస్యలపై కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. సమాచారం కోసం 08561 293006 నెంబర్‌కి ఉదయం 8 నుంచి రాత్రి 8 వరకు సమాచారం ఇవ్వవచ్చునన్నారు.

జిల్లాకు నాలుగు డైరెక్టర్ పదవులు

రాయచోటి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం బుధవారం రాత్రి విడుదల చేసిన పలు కార్పొరేషన్ల డైరెక్టర్ల పదవులు జిల్లాకు నాలుగు దక్కాయి. ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా రైల్వేకోడూరుకు చెందిన పులివెల రమేశ్‌బాబు నియమితులయ్యారు. ఏపీ కుమ్మరి శాలివాహన వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా మదనపల్లెకు చెందిన పి.భావన, రాయచోటికి చెందిన గుడి స్వర్ణ నియమితులయ్యారు. ఏపీ స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా రాయచోటికి చెందిన మస్తాన్‌బీ నియమితులయ్యారు.

నేడు 5కే మారథాన్ రన్

రాయచోటి (కలెక్టరేట్), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమంపై ఈనెల 4వ తేదీ 5కే మారథాన్ రెడ్‌రన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కుష్ఠు, ఎయిడ్స్, టీబీ అధికారి రమేశ్‌బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాయచోటిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పురుషుల) నుంచి నారాయణరెడ్డిపల్లె సర్కిల్ వరకు అనంతరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పురుషుల) వరకు ఈ మారథాన్ రెడ్‌రన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 6 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

శాస్త్రోక్తంగా పవిత్రాల సమర్పణ



పవిత్రాలు తీసుకొస్తున్న దృశ్యం

నందలూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సౌమ్యనాథస్వామి ఆలయంలో బుధవారం శాస్త్రోక్తంగా పవిత్రాల సమర్పణ జరిగింది. ఉదయం స్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపి యాగశాలలో పుణ్యాహవచనం, కుంభ ఆరాధన, ప్రధాన హోమాలు జరిగాయి. అనంతరం యాగశాలలో పవిత్ర మాలలకు ఉపచారాలు నిర్వహించి ప్రదక్షిణగా సన్నిధికి తీసుకొచ్చారు. మూలవరులకు, ఉత్సవవరులకు విష్వక్సేన, ద్వారపాలకులు, భాష్యకార్లు, గరుడాళ్వార్, బలిపీఠం, ధ్వజస్తంభం, ప్రధాన కుంభానికి పరివార దేవతలకు పవిత్రాలు సమర్పించారు. అనంతరం స్నపన తిరుమంజనం చేశారు. సాయంత్రం యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ హనుమంతయ్య, ఆలయ ఇన్‌స్పెక్టర్‌లు దిలీప్, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

కట్టుదిట్టంగా రైతులకు యూరియా పంపిణీ చేయాలి : సబ్‌కలెక్టర్



అంకిశెట్టిపల్లె ఆర్ఎస్‌కే వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు

మదనపల్లెటౌన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాలు, ప్రైవేటు డీలర్లకు సరఫరా అయ్యే యూరియాను కట్టుదిట్టంగా రైతులకు పంపిణీ చేయాలని సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి ఆదేశించారు. బుధవారం అంకిశెట్టిపల్లె ఆర్ఎస్‌కే వద్ద యూరియా పంపిణీని సబ్ కలెక్టర్ పరిశీలించారు. రైతులకు ఎన్ని బస్తాలు ఇస్తున్నారు, ఎంత స్టాకు వచ్చింది తదితర విషయాలను ఏఓ నవీన్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. 12 మెట్రిక్ టన్నుల యూరియా స్టాకు వచ్చిందని పాసుపుస్తకాలు తీసుకొచ్చిన రైతులకు ఒక్కో బస్తా పంపిణీ చేస్తున్నామన్నారు. కేవలం మదనపల్లె మండల రైతులకు మాత్రమే యూరియా ఇస్తున్నామన్నారు. అంకిశెట్టిపల్లె టీడీపీ ఇన్‌చార్జి జంగాల రమణ సబ్‌కలెక్టర్‌తో మాట్లాడుతూ అంకిశెట్టిపల్లెలో రెవెన్యూ సమస్యలు ఎక్కువగా వున్నాయని, రీసర్వే చేసిన పుడు రికార్డుల్లో భూముల వివరాలు తప్పుగా నమోదు చేశార న్నారు. రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పుల విషయమై రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. వీటన్నింటిపై అర్జీ రాసి తీసుకొస్తే విచారించి ప్రజలకు న్యాయం చేస్తామని సబ్‌కలెక్టర్ సూచించారు.

ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరించాలి

● డీపీఓ రాధమ్మ



పంచాయతీ అధికారులతో మాట్లాడుతున్న డీపీఓ రాధమ్మ

పీలేరు రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటి నుంచి రెండు రోజులకు ఒక సారి చెత్త సేకరించాలని డీపీఓ రాధమ్మ తెలిపారు. బుధవారం పంచాయతీలో చెత్త సేకరణపై ఆకస్మిక తనిఖీ చేపట్టిన ఆమె మాట్లాడుతూ శానిటేషన్‌పై తరచూ పీలేరు నుంచి ఫిర్యాదులు వస్తుంటాయని, ఇకపై సిబ్బంది, కార్మికులు పనితీరు మార్చుకోవాలని ఆదేశించారు. పంచాయతీలో 121 మంది వర్కర్లు ఉన్నప్పుడు ఇక సమస్య ఎందుకు ఉత్పన్నమౌతోందని ఇన్‌చార్జి ఈఓను ప్రశ్నించారు. క్షేత్ర స్థాయిలో పర్యటించాలని, కార్యాలయాలకే పరిమితమైతే ఇబ్బందులు తప్పవని చురకలంటించారు. తడి, పొడి చెత్తను విధిగా సేకరించాలన్నారు. పీలేరులో మినరల్ వాటర్ ప్లాంట్ల వర్కర్ల జీతాలు త్వరలోనే చెల్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి ఈఓ లతీఫ్ ఖాన్, ఇతర కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'హైవే' రైతులకు నగదు జమ

● ఖాతాల్లోకి విడతల వారీగా రూ.4.65కోట్లు



వేంపల్లెలో నేషనల్ హైవే రోడ్డు వేయనున్న భూములు ఇవే

వేంపల్లె, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాయచోటి-చాగలమర్రి నేషనల్ హైవే (440) రోడ్డుకు గానూ వేంపల్లెలో భూములు, ఇళ్లస్థలాలు కోల్పోయిన వారికి పరిహారం ఖాతాల్లో జమ అయింది. వేంపల్లె మండలానికి సంబంధించి కడప రోడ్డు నుంచి పాపాఘ్ని నదీ ఒడ్డు మీదుగా గండిరోడ్డులోని పాలిటెక్నికల్ కళాశాల వరకు 5 కిలోమీటర్ల మేర రోడ్డుకోసం భూములు, ఇళ్లస్థలాలను ప్రభుత్వం సేకరించింది. వ్యవసాయ భూములకు ఎకరాకు రూ.34.11 లక్షల చొప్పున, ఇళ్ల స్థలాల్లో ఎకరాకు రూ.1.95కోట్ల చొప్పున పరిహారం నిర్ణయించారు. మొదటి విడతగా మంగళవారం రూ.4.65 కోట్లు ఖాతాల్లో జమ అయింది. 42.80 ఎకరాల వ్యవసాయ భూమి 16ఎకరాల మేర ఇళ్లస్థలాలు కోల్పోతున్నారు. ఇందులో ఇళ్లస్థలాలకు రూ.23 కోట్ల దాకా రావాల్సి ఉంది. వారికి ఇంకా నగదు జమ చేయలేదు. వ్యవసాయ భూములకు సంబంధించి 42.80 ఎకరాలకు గాను రూ.25.70 కోట్లు రావాల్సి ఉండగా ప్రస్తుతం రూ.4.65 కోట్లు రైతుల ఖాతాల్లో జమ అయిందని నేషనల్ హైవే పర్యవేక్షణ ఇంజనీర్ సురేంద్ర తెలిపారు. మరికొద్ది రోజుల్లో మిగిలిన పరిహారం ఖాతాల్లో జమ అవుతుందన్నారు. ఈ రోడ్డును ఎస్ఎస్‌వీ సంస్థ టెండర్ దక్కించుకుంది. రైతులకు పరిహారం అందించిన తర్వాత పనులు మొదలుపెడతారని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

ప్రధాన చెరువులు నిండేనా...?

● కృష్ణా జలాల నీటి కోసం రైతుల ఎదురుచూపు

● పూర్తి కాని చెరువుల అనుసంధానం, కాలువ నిర్మాణ పనులు

పెద్దతిప్పసముద్రం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనే ప్రధాన చెరువులుగా ప్రఖ్యాతి గాంచిన చెరువుల్లో కందుకూరు వ్యాసరాయ, పెద్దతిప్పసముద్రం, తిప్పరాయ, రంగసముద్రం రంగరాయ చెరువులు జిల్లాలోనే ప్రధాన చెరువులుగా మంచి గుర్తింపు పొందాయి. ఈ మూడు చెరువుల్లో నీరు ఉంటే ఏడాదికి మూడు పంటలు పుష్కలంగా పండుతాయి. అయితే వర్షాభావం కారణంగా చెరువుల్లోకి నీరు రావడం లేదు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పడమటి మండలాల్లో ఒక్కటైన పెద్దతిప్పసముద్రం మండలంలోని ఈ మూడు చెరువులను కృష్ణాజలాలతో నింపాలని కందుకూరు వ్యాసరాయ సముద్రం చెరువు, పెద్దతిప్పసముద్రం తిప్పరాయసముద్రం సముద్రం చెరువులకు అనుసంధాన కాలువ పనులు ప్రారంభించారు. అయితే ఆ కాలువ నిర్మాణ పనులు ఎక్కడికక్కడ నిర్మాణ దశలోనే ఆగిపోయాయి. గత వైసీపీ ప్రభుత్వంలో చెరువులను నింపుతామని అరకొరగా కాలువల్లో నీటిని విడుదల చేసి మిన్నకుండి పోవడంతో చెరువుల్లోకి నీరు విడుదల కలగానే మిగిలిపోయింది.



కందుకూరు వ్యాసరాయ సముద్రం చెరువు (ఫైల్)



పెద్దతిప్పసముద్రం తిప్పరాయసముద్రం చెరువు (ఫైల్)

పూర్తి కాని కందుకూరు చెరువు ఎత్తిపోతల పనులు

కందుకూరు వ్యాసరాయసముద్రం చెరువు జిల్లాలోనే అతిపెద్ద చెరువుల్లో ఒకటి. ఈ చెరువు 369.8 ఎంసీఎఫ్‌టీ సామర్థ్యం. ఎత్తిపోతల పథకం ద్వారా హంద్రీ-నీవా జలాలను ఈ చెరువును నింపాలనే ఉద్దేశ్యంతో కాలువ నిర్మాణాన్ని చేపట్టారు. అయితే ఆ కాలువ నిర్మాణం పనులు పూర్తి కాకుండానే అర్ధంతరంగా నిలిచిపోయాయి. గత వైసీపీ ప్రభుత్వంలో కుప్పంకు నీటిని తరలిస్తున్నాం అని నానా యాగీ చేసి కాలువల్లో నీటిని వదిలి చెరువులన్నీ నింపి వ్యవసాయ భూములను సస్యశ్యామలం చేస్తామని వైసీపీ ప్రభుత్వం బీరాలు పలికింది. హంద్రీనీవా పుంగనూరు బ్రాంచి కెనాల్ పరిధిలోని తంబళ్లపల్లె, మదనపల్లె, పుంగనూరు నియోజకవర్గాల్లో 78 చెరువులకు కాలువ ద్వారా కృష్ణా జలాలు అందించాల్సి ఉన్నా ఆ ప్రయత్నాన్ని చేపట్టలేదు. వేల కోట్లు ఖర్చు చేసి హంద్రీనీవా సుజలస్రవంతి కాలువలను నిర్మించారు. వైసీపీ ప్రభుత్వం ఎత్తిపోతల పథకాలు, కాలువల నిర్మాణాలకు ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు. అయితే తరువాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఒకేసారి రూ.3800 కోట్లు మంజూరు చేసి లైనింగ్ పనులను పూర్తి చేసి కాలువలకు నీటిని విడుదల చేయడంతో రైతుల్లో ఆనందం నెలకొంది. గత ప్రభుత్వంలో చేయలేని పనిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసి చూపించాడని కనీసం ఈ కూటమి ప్రభుత్వంలోనైనా పడమటి మండలాల్లో ఉన్న ఈ మూడు ప్రధాన చెరువులకు నీటిని విడుదల చేస్తారని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

కృష్ణా జలాలతో చెరువులను నింపండి

చెర్లోపల్లె రిజర్వాయర్ నుంచి 7 లిఫ్టుల ద్వారా పుంగనూరు బ్రాంచి కెనాల్ మీదుగా అప్పినపల్లెకు, అక్కడి నుంచి కుప్పం ప్రాంతంలోని పరమసముద్రం చెరువుకు నీటిని తరలించేందుకు రెండు నెలలు పట్టింది. అయితే కూటమి ప్రభుత్వం కాలువలకు లైనింగ్ పనులను చేపట్టడంతో కృష్ణజలాలు అత్యంత వేగంగా కుప్పంకు తరలి వెళుతుండడంతో రైతుల్లో ఆశ చిగురిస్తోంది. చెర్లోపల్లె రిజర్వాయర్ నుంచి 150-200 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినా కుప్పంకు 10 క్యూసెక్కుల నీరు కూడా గతంలో చేరలేదు. సుమారు 400 కిలోమీటర్ల దూరం ప్రవహించాల్సి ఉన్నందున గతంలో నీరు వేగంగా సాగకపోవడంతో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం నెరవేరలేదు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కాలువలకు లైనింగ్ పనులు చేయడంతో నీరు వేగంగా కుప్పం చేరుకుంటోంది. కుప్పం చెరువులు నిండాక కనీసం ఈసారైనా పెద్దతిప్పసముద్రం మండలంలో ఉన్న ప్రధాన చెరువులను నీటితో నింపుతారా లేదా అని రైతులు ఎదురు చూస్తున్నారు.

ప్రధాన చెరువులకు జలాలు విడుదల చేయండి

పెద్దతిప్పసముద్రం మండలంలోని ప్రదాన చెరువులను ఈ కూటమి ప్రభుత్వంలోనైనా కృష్ణా జలాలతో నింపాలని, కృష్ణా జలాలతో చెరువులను నింపితే రైతులు ఏడాదికి మూడు పంటలను సాగు చేసుకుని జీవనం సాగిస్తామని ఆయకట్టుదారులు కోరుతున్నారు. ముఖ్యంగా పెద్దతిప్పసముద్రం మండలంలోని ప్రధాన చెరువులైన కందుకూరు వ్యాసరాయ సముద్రం చెరువు, పెద్దతిప్పసముద్రం తిప్పసముద్రం, రంగసముద్రం రంగరాయ సముద్రం చెరువులకు నీటిని విడుదల చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

రంగసముద్రం చెరువుకు హంద్రీనీవా జలాలను మళ్లించండి

- చెన్నకేశవులు, రంగసముద్రం చెరువు సంఘం చైర్మన్



రంగసముద్రం రంగరాయ చెరువును గత పాలకులు విస్మరించడంతో రంగరాయ చెరువుకు హంద్రీ-నీవా జలాలు కలగానే మిగిలాయి. గత ప్రభుత్వంలో మండలంలోని అన్ని ప్రదాన చెరువులను హంద్రీ-నీవా నీటిని నింపుతామని ప్రగల్బాలు పలికిన పాలకులు రంగసముద్రం చెరువుకు నీటిని మళ్లించనే లేదు. రంగసముద్రం చెరువుకు నీటిని నింపితే సుమారు. 1500 ఎకరాల ఆయకట్టుదారులు పుష్కలంగా పంటలను సాగుచేసుకునేందుకు అవకాశం ఉంటుంది.

అడ్డుకున్నాడని.. పెట్రోల్ పోసి నిప్పుపెట్టారు

● రాయచోటి దుండగుల అరాచకం



పెట్రోల్ పోసిన దాడిలో గాయపడిన యువకుడు

మదనపల్లెఅర్బన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణం బి.కె.పల్లెకు చెందిన ఓ వ్యక్తిపై, జిల్లా కేంద్రం రాయచోటికి చెందిన కొందరు దుండగులు పెట్రోల్ పోసి నిప్పంటించారు. బుధవారం తెల్లవారు జామున జరిగిన ఈ అమానుష ఘటనతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. మంటల్లో కాలుతున్న బాధితున్ని గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం వెంటనే స్థానిక జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ ప్రథమ చికిత్స అనంతరం బాధితున్ని మెరుగైన చికిత్స నిమిత్తం వైద్యులు తిరుపతికి రెఫర్ చేశారు. పోలీసుల కథనం మేరకు..మదనపల్లె పట్టణం, బీకేపల్లెకు చెందిన షేక్ మహబూబ్‌బాషా, షేక్ ఖాసీంసాహెబ్ అన్నదమ్ములు. అయితే ఏడాది కిందట షేక్ మహబూబ్‌బాషా మృతిచెందాడు. షేక్ ఖాసీంసాహెబ్ రాయచోటిలో ఉంటున్నాడు. అయితే అన్నదమ్ముల మధ్య ఆస్తి తగాదాలు ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. ఈ క్రమంలో 15రోజుల కిందట రాయచోటిలోని ఖాసీంసాహెబ్ కుమారులు జావీద్‌బాషా, షామీర్‌బాషా మరికొంతమందితో వచ్చి మహబూబ్‌బాషా కుమారుడు సలీంబాషాతో ఘర్షణ పడ్డారు. తిరిగి బుధవారం తెల్లవారు జామున వచ్చి మరోసారి వివాదానికి ప్రయత్నం చేశారు. అయితే అదే ఇంట్లో అద్దెకు ఉంటున్న రమేష్‌నాయక్‌పై పెట్రోల్ పోసి నిప్పంటించారు. తన బంధువైన షేక్ సలీంబాషాపై దాడి చేయడానికి వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. అయితే ఆయన ఇంటి పైభాగంలో ఉండడంతో అక్కడికి వెళ్లేందుకు గేటు అడ్డుగా ఉంది. ఈ క్రమంలో చుట్టుపక్కల శబ్దాలు చేస్తుండడంతో గమనించిన స్థానికులు అక్కడికి చేరుకుని సర్దిచెప్పే ప్రయత్నం చేసినా వినలేదని సమాచారం. అంతలోనే రమేష్‌నాయక్‌తో పాటు సమీపంలోని మరో వ్యక్తిపై దాడి చేసినట్లు తెలిసింది. సంఘటనా స్థలానికి చేరుకున్న ఓ వ్యక్తి ద్విచక్ర వాహనాన్ని కూడా ధ్వంసం చేసినట్లు చెబుతున్నారు. సలీంబాషా ఇంట్లో రమేష్‌నాయక్(39) బాడుగకు ఉంటూ ఐదేళ్లుగా అక్కడే జిరాక్స్ సెంటర్‌ను నిర్వహిస్తూ జీవిస్తున్నాడు. వీరిని అడ్డుకున్న రమేష్‌నాయక్‌పై కోపోద్రిక్తులైన దుండగులు వెంటతెచ్చుకున్న పెట్రోల్ పోసి నిప్పు పెట్టి పారిపోయారు. మంటలు తాళలేక గట్టిగా అరవడంతో గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు వెంటనే మంటలను ఆర్పి స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. సమాచారం అందుకున్న టూటౌన్ పోలీసులు సంఘటన స్థలం వెళ్లి సంఘటనపై విచారణ చేపట్టారు. ఈ మేరకు టూటౌన్ సీఐ రాజారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇలాంటి సంఘనటలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని బాధితుని కుటుంబ సభ్యులు కోరారు.

ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

రైల్వేకోడూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని కెనరా బ్యాంకు ఆర్సీటీ కో-ఆర్డినేటర్ కె.సుధాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం రైల్వేకోడూరు గిరిజమ్మ వీధిలో టైలరింగ్ శిక్షణ పొందుతున్న మహిళలకు ఉపాధి అవకాశాలపై గ్లోబల్ సర్వీస్ ట్రస్ట్ చైర్మన్ కె.పార్థసారథి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప శివారులోని కెనరా బ్యాంకు ఆర్సీటీ కేంద్రంలో ప్రతి నెల మహిళలకు టైలరింగ్, జ్యూట్, పెయింటింగ్, యువకులకు ఫొటోగ్రఫీ, డ్రైవింగ్, హౌస్ వైరింగ్ వంటి అంశాలపై ఉచితంగా శిక్షణ ఇస్తున్నారని తెలిపారు. శిక్షణకాలంలో ఉచిత వసతి, భోజన సదుపాయాలు, మెటీరియల్ కూడా ఉచితంగా ఇస్తారని తెలిపారు. ఈ నెల 26 నుంచి మహిళలకు టైలరింగ్, బ్యూటీపార్లర్ మేనేజ్‌మెంట్‌పై నెల రోజుల పాటు ఉచితంగా శిక్షణ ఇస్తారని తెలిపారు. 18 ఏళ్ల వయస్సు నిండిన కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన మహిళలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఉపాధి ద్వారా అభివృద్ధి చెందుటకు ట్రస్ట్ ద్వారా సహకారం అందిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కో-ఆర్డినేటర్ ముస్కీనా, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు కోర్టు ఏపీపీగా శివరామకృష్ణ నియామకం

కలికిరి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బద్వేలు అదనపు సహాయ సెషన్స్ జడ్జి కోర్టులో ఏపీపీగా న్యాయవాది డి.వి.శివరామకృష్ణను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. మూడేళ్లపాటు ఆయన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కొనసాగనున్నారు. నెలకు రూ.25 వేల గౌరవ వేతనంతో శివరామకృష్ణను నియమిస్తున్నట్లు పేర్కొంటూ హోం శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్ బుధవారం నోటిఫికేషన్ జారీ చేశారు.

వడ్డివారిపల్లెలో ట్రాక్టర్ చోరీ

రామసముద్రం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వడ్డివారిపల్లెలో మంగళవారం రాత్రి రైతు ట్రాక్టర్ చోరీకి గురైంది. గ్రామానికి చెందిన కట్టకింద శ్రీనివాసులు అనే రైతు పొలం పనులు ముగించుకుని యధావిధిగా రాత్రి ఇంటి పక్కనే తన ట్రాక్టర్ ఏపీ39 ఎంకే2633ను నిలిపి నిద్రిస్తున్న సమయంలో చోరీ జరిగినట్లు రైతు శ్రీనివాసులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కలెక్టర్ నిర్ణయించిన ధరలు అమలు చేయాలి

●బొప్పాయి రైతుల వినతి



సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రాజంపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దళారు బొప్పాయి ధరలు తగ్గించి రైతుల పాలిట శాపంగా మారారని ఏపీ రైతుసంఘం, సీఐటీయూ నేతలు, బొప్పాయి రైతులు సబ్‌కలెక్టర్ భావనకు ఫిర్యాదు చేశారు. బుధవారం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట రైతుసంఘం నేతలు నిరసన తెలియజేసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆగస్టు 6న బొప్పాయి రైతులు, దళారులతో చర్చించిన అనంతరం కలెక్టర్ చామకూరి శ్రీధర్ కిలో ధరను రూ.6 నుంచి రూ.10 చెల్లించాలని నిర్ణయించారన్నారు. ఆ ధరలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు సి.రవికుమార్, రాష్ట్ర రైతు సంఘం చిట్వేలి మండలాధ్యక్షుడు ఆదినారాయణ, ఈశ్వరయ్య, వెంకటరమణ, రైతు సంఘ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో గణేశుడి నిమజ్జన ఉత్సవం





పోలీసు కుటుంబాల పిల్లలకు ఆటల పోటీలు ప్రారంభిస్తున్న జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి, జిల్లా పోలీసు కార్యాలయం నుంచి వినాయకుడికి నిమజ్జనానికి తరలిస్తున్న పోలీసు సిబ్బంది

రాయచోటిటౌన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని బుధవారం నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా మహిళా పోలీసులు, జిల్లా పోలీసు కార్యాలయ మహిళా సిబ్బంది ఆటల పోటీలను అదనపు ఎస్పీ ఎం. వెంకటాద్రి జెండా ఊపి ప్రారంభించారు. మ్యూజికల్ చైర్స్, లెమన్ అండ్ స్పూన్ విజేతలకు అదనపు ఎస్పీ ఎం. వెంకటాద్రి, ఏఆర్ డీఎస్పీ ఎం. శ్రీనివాసులు ఇతర ఉన్నతాధికారులు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన వేలంలో లడ్డూను జిల్లా పోలీసు కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ మజ్జారి సునీల్‌కుమార్ రూ.57 వేలకు దక్కించుకున్నారు. అనంతరం కార్యక్రమానికి విచ్చేసిన భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. డప్పుల మోత, నృత్యాలతో ఊరేగింపుగా వినాయకుడి నిమజ్జనానికి తరలించారు. ఈ వేడుక విజయవంతానికి సహకరించిన సిబ్బందికి అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి కృతజ్ఞతలు తెలియజేశారు. విగ్రహ దాత ఏఆర్ పీసీ 427 కే. పరమేశ్‌కు అభినందనలు తెలియజేశారు ఏఆర్ డీఎస్పీ ఎం.శ్రీనివాసులు, ఎస్‌బీ ఇన్‌పెక్టర్ పీ.రాజారమేశ్, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ ఎం.తులసీరాం, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు వీజే రామకృష్ణ, టీ.జాన్‌జోసఫ్, ఎం.పెద్దయ్య, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు పోలీసు సిబ్బంది, పోలీసు కార్యాలయ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు, హోంగార్డులు, పోలీసు కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పీలేరుకు సరిపడా యూరియా సరఫరా

● ఏడీ రమణరావు

పీలేరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): తన పరిధిలోని పీలేరు, కేవీపల్లె మండలాలకు సరిపడా యూరియాలో 90 శాతం ఇప్పటికే సరఫరా చేశామని, పొరుగు మండలాల రైతుల కారణంగా పీలేరులో యూరియా కొరత ఉన్నట్లు వార్తలు వస్తున్నాయని వ్యవసాయ శాఖ ఏడీ రమణరావు పేర్కొన్నారు. పీలేరులో జరుగుతున్న యూరియా పంపిణీ తీరును బుధవారం తనిఖీ చేసిన ఆయన మాట్లాడుతూ పీలేరు, కేవీపల్లె మండలాల్లో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో మామిడి తోటలతో సహా సుమారు 7 వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తున్నారన్నారు. పీలేరు మండలానికి ఖరీఫ్ సీజన్ కోసం 305 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా మండలంలోని 12 రైతు సేవా కేంద్రాల ద్వారా 233 మెట్రిక్ టన్నులు, డీలర్ల ద్వారా మరో 130 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశామన్నారు. మరో 80 మెట్రిక్ టన్నులు రెండు, మూడు రోజుల్లో వస్తున్నాయన్నారు. కేవీపల్లె మండలానికి 309 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా మండలంలోని 12 రైతు సేవా కేంద్రాల ద్వారా 294 మెట్రిక్ టన్నులు, డీలర్ల ద్వారా 20 మెట్రిక్ టన్నులు సరఫరా చేశామన్నారు. మరో 50 మెట్రిక్ టన్నులు వస్తున్నాయన్నారు. పీలేరు, కేవీపల్లె మండలాల రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. వారి అవసరాల మేరకు యూరియా అందుబాటులో ఉందన్నారు. పీలేరు, కేవీపల్లె మండలాలకు పొరుగున్న రొంపిచెర్ల, చిన్నగొట్టిగల్లు, సదుం, పులిచెర్ల, ఎర్రావారిపాళెం మండలాల రైతులు కూడా యూరియా కోసం పీలేరుకు వస్తుండడంతో కొరత ఉన్నట్లు కనిపిస్తోందన్నారు. అయితే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక రైతులకు ప్రథమ ప్రాధాన్యత ఇచ్చి యూరియా అందిస్తున్నామని, దీంతో పొరుగు మండలాల రైతులు నిరాశ పడుతున్నారన్నారు. అవసరమైన మేరకు రైతులు యూరియాను వినియోగించాలని ఆయన ఈ సందర్భంగా రైతులకు సూచించారు.



టోకెన్ల పంపిణీని పరిశీలిస్తున్న అధికారులు

బద్వేలులో యథేచ్ఛగా మట్టి తరలింపు

- బరితెగిస్తున్న మట్టి మాఫియా
- పగలు రాత్రి తేడా లేకుండా మట్టి తరలిస్తున్న వైనం
- చోద్యం చూస్తున్న అధికారులు



గొడుగునూరు చెరువు నుంచి ఆక్రమంగా మట్టిని తరలిపోతున్న దృశ్యం

బద్వేలు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బద్వేలులో అక్రమ మట్టి తరలింపునకు అడ్డు అదుపు లేకుండా పోతోంది. మట్టికి ఉన్న డిమాండ్‌ను ఆసరాగా చేసుకుని మట్టి మాఫియా బరితెగిస్తోంది. కొండలు, గుట్టలు, చెరువుల్లో సైతం మట్టి తవ్వి యథేచ్ఛగా తరలిస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా చెరువుల నుంచి మట్టిని తవ్వి ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా నూతనంగా నిర్మిస్తున్న ఇళ్ల కోసం తరలిస్తున్నారు. గ్రావెల్ (మట్టి)కు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని మట్టిమాఫియా పగలు, రాత్రి అనే తేడా లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ కార్యాలయాల సెలవు దినాలలో ఈ దందా సాగిస్తున్నారు.

బద్వేలు పట్టణం రోజు రోజుకు విస్తరిస్తున్న తరుణంలో ఇళ్ల నిర్మాణాలకు, అక్రమ లే అవుట్లకు అవసరమైన మట్టికి బాగా గిరాకీ ఉంది. మట్టి తవ్వేందుకు అనుమతులు ఉండి తరలిస్తే పర్వాలేదు. కానీ రాజకీయ పలుకుబడులతో రోజూ బద్వేలు, గోపవరం ప్రాంతాలలో మట్టి మాఫియా అక్రమంగా రోజుకు 200 టన్నుల మట్టిని తరలిస్తోంది. అక్రమ మట్టి తవ్వకాలకు కళ్లెం పడకపోతే ఆ ప్రాంతంలో చెరువులు, వంకలు వాటి స్వరూపాలే పూర్తిగా మారిపోయే దుస్థితి నెల కొంది. ఇదే జరిగితే వర్షపునీరు చెరువుల్లో చేరే పరిస్థితి గానీ, కొద్దో, గొప్పో చెరువుల్లో నీరు చేరినా బయటకు వచ్చే పరిస్థితి గానీ లేదు.

అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు తప్పవు

అనుమతి లేకుండా చెరువులలో మట్టి తర లిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. గొడుగునూరు చెరువు నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లగా వెంటనే మట్టి తవ్వకాలను నిలుపుదల చేస్తామన్నారు.

-వేణుగోపాల్‌రెడ్డి, ఇరిగేషన్ డీఈ, బద్వేలు

రోజుకు 1200 ట్రాక్టర్ల మట్టి తరలింపు

బద్వేలు, గోపవరం ప్రాంతాల నుంచి రోజుకు దాదాపు 1200 ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా మట్టిని తరలిస్తూ లక్షలాది రూపాయలు సంపాదించడమే ధ్యేయంగా పెట్టుకున్నారు. బాకరాపేట చెరువు, శంకరాపురం, సగిలేరుతో పాటు ప్రభుత్వ భూముల నుంచి అక్ర మంగా మట్టిని తరలిస్తున్నారు. కొత్తగా ఇంటి నిర్మాణాలకు, అక్రమ లే అవుట్లకు ఈ మట్టిని తరలిస్తున్నారు. ప్రొక్లైన్లతో పగలు, రాత్రి అనే తేడా లేకుండా తవ్వకాలు జరిపి ట్రాక్టర్లు, టిప్పర్లతో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అయితే వీరికి రాజకీయ నాయకుల అండదండలు ఉండడంతో అధికారులు కూడా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. ఏది ఏమైనా అక్ర మ మట్టి తరలింపునకు అడ్డుకట్ట వేయకపోతే చెరువులు, కుంటలు రూపురేఖలు లేకుండా పోతాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్ప టికైనా రెవెన్యూ, ఇరిగేషన్, పోలీసు అధికారులు మట్టి అక్రమ తవ్వకాల తరలింపుపై దృష్టిపెట్టి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

భారీ స్కోర్ దిశగా కడప

- స్వల్ప వెనుకంజలో అనంతపురం



నాగచైతన్య, ప్రమోద్‌కుమార్, ప్రశాంత్

కడప స్పోర్ట్స్, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ సౌత్‌జోన్ అండర్-23 మెన్స్ మల్టీడే ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ పోటీలలో భాగంగా బుధవారం వివిధ జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లలో కడప జట్టు 304 పరుగులతో భారీ స్కోర్ దిశగా సాగుతోంది. మరో మ్యాచ్‌లో అనంతపురం జట్టు స్వల్ప వెనుకంజలో వుంది. వివరాలిలా..... నగర రిమ్స్ సమీప వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో కడప-కర్నూలు జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లో టాస్‌నెగ్గిన కడప జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో మొదటిరోజు ఆట ముగిసే సమయానికి 81 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 304 పరుగులు చేసింది. ఇందులో నాగచైతన్య 53 పరుగులు చేయగా విజయ్‌రామిరెడ్డి 62 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు.

కేఎస్ఆర్ఎం మైదానంలో నెల్లూరు-అనంతపురం జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన నెల్లూరు జట్టు బ్యాటింగ్‌కు దిగి మొదటి ఇన్నింగ్స్‌లో 44.4 ఓవర్లలో 239 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో పవన్‌రిత్విక్ 50 పరుగులు, మాధవ్ 56 పరుగులు చేశారు. బౌలింగ్ విభాగంలో అనంతపురం జట్టు బౌలర్ ప్రమోద్ కుమార్ 5 వికెట్లు పడగొట్టారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 36 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 196 పరుగులు చేసింది. ఇందులో ప్రశాంత్ 90 పరుగులు, అర్జున్ టెండూల్కర్ 52 పరుగులు చేశారు. దీంతో అనంతపురం జట్టు మరో 43 పరగుల స్వల్ప పరుగుల వెనుకంజలో వుంది.

7న గండి ఆలయం మూసివేత

చక్రాయపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో వీరాంజనేయస్వామి ఆలయాన్ని ఈనెల 7వ తేదీ చంద్రగ్రహణం కారణంగా మూసివేయడం జరుగుతుందని ఆలయ సహాయ కమిషనర్ జె.వెంకటసుబ్బయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 7వ తేదీ సాయంత్రం 4గంటల నుంచి ఆలయం మూసివేసి తిరిగి 8వ తేదీ సోమవారం తెల్లవారు జామున సంప్రోక్షణ చేసి ఉదయం 5గంటల నుంచి ఆలయాన్ని తెరిచి.. సుప్రభాతం, పుణ్యాహవాచనం, ఆలయశుద్ధి, స్వామివారికి పంచామృత అభిషేకం, ఆరాధన, నివేదిన అనంతరం ఉదయం 7గంటల నుంచి స్వామివారి సర్వదర్శనం ప్రారంభం అవుతుందన్నారు.

ప్రొద్దుటూరులో శివాలయంలో...

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయాన్ని ఈనెల 7వ తేదీ సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా మూసివేస్తున్నట్లు దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్, ఆలయ ఈవో వెంకటసుబ్బయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం రాత్రి 9.50 గంటలకు చంద్రగ్రహణం ప్రారంభం అవుతుందని, సోమవారం తెల్లవారుజామున 3.41 గంటలకు గ్రహణం విడుస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటలకు స్వామివారికి మహానైవేద్యం సమర్పించి ఆలయాన్ని మూసివేస్తామని, సోమవారం ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, పుణ్యా ఆవాచనం, సంప్రోక్షణ తర్వాత భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు.

ఫ్లెక్సీ తొలగింపు... ఇద్దరిపై ఫిర్యాదు

బ్రహ్మంగారిమఠం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిరసవంచ గ్రామంలో డిప్యూటీ సీఎం కొణిదెల పవన్‌కళ్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా అదే గ్రామానికి చెందిన జనసేన నేత అన్నలూ రు రవి గ్రామంలో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అదే గ్రామానికి చెందిన పాణ్యం రామాజనేయులు, పాణ్యం రవీంద్ర అనే వ్యక్తులు ఫ్లెక్సీలు తొలగించారని బుధవారం బి.మఠం స్టేషన్‌లో ఫిర్యాదు అన్నలూరు రవి ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు. విచారణ చేసి వారిపై కేసు నమోదు చేస్తామని తెలిపారు.

చోరీలకు ప్రయత్నించిన వారిపై బైండోవర్‌కేసు

కలసపాడు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలుచోట్ల చోరీలకు ప్రయత్నించిన ఐదుగురు మహిళలు, ఒక యువకుడిపై బైండోవర్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. చిత్తుకాగితాలు ఏరుకుంటూ మండలంలోని ముద్దంవారిపల్లె, మహానందిపల్లెల్లో ఇళ్లలో ఎవరూలేని సమయంలో చోరీకి పాల్పడుతున్నట్లు తెలిసి వారిని హెడ్‌కానిస్టేబుల్ నాగార్జున, ఎస్‌బి కానిస్టేబుల్ రిజ్వాన్ అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం అనుమానాస్పద వ్యక్తులుగా గుర్తించి వీరిపై బైండోవర్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిమోతి తెలిపారు. వీరిని బుధవారం డిప్యూటీ తహసీల్దార్ మోహన్ రాజు వద్ద హాజరుపరిచారు.

చీటీ డబ్బులు వసూలు చేసి రూ. కోటి 80లక్షలతో మహిళ పరారీ

కడప క్రైం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో ఓ మహిళ చీటీల డబ్బుతో పరారైనట్లు తెలుస్తోంది. ఈమె నాగరాజుపేటలోని రవి థియేటరు సమీపంలో నివాసం ఉంటూ... చుట్టుపక్కల మహి ళలను కలుపుకుని ప్రైవేటు చీటీలు వేసుకుంటూ ఉండేది. గత కొంత కాలంగా చీటీల డబ్బులు దాదాపు రూ.కోటి 80 లక్షలు వసూలు చేసి... వారం రోజుల క్రితం ఇళ్లు ఖాళీ చేసి కుటుంబసభ్యులతో కలసి పరారైనట్లు తెలుస్తుంది. దీంతో బాధితులు బుధవారం కడప వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించారు.

హెడ్‌కానిస్టేబులుపై సస్పెన్షన్ వేటు

- ఎస్ఐకి చార్జ్ మెమో

కడప క్రైం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కడప నగరం టూటౌన్ పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న పరమేశ్ అనే హెడ్‌కాని స్టేబుల్‌ను సస్పెండ్ చేస్తూ పోలీసు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈయనను రైల్వే కొండాపురం స్టేషన్‌కు బదిలీ చేశారు. హెడ్‌కానిస్టేబుల్ అక్కడికి వెళ్లకపోవడంపై ఉన్నతాధికారులు సీరియస్ అయినట్లు తెలుస్తుంది. దీంతో ఆయనపై సస్పెన్షన్ వేటు వేయడంతో పాటు ఎస్ఐకి చార్జి మెమోను అందించినట్లు సమాచారం.

ఉల్లి సాగులో మేలు రకం విత్తనాలు ఎంపిక చేసుకోవాలి

- జిల్లా ఉద్యానశాఖాధికారి రవిచంద్రబాబు



ఉల్లి పంటసాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా ఉద్యానశాఖాధికారి రవిచంద్రబాబు

కాశినాయన, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉల్లి పంటను సాగు చేసే రైతులు మేలు రకం విత్తనాలను ఎంపిక చేసుకోవాలని జిల్లా ఉద్యానశాఖాధికారి రవిచంద్రబాబు పేర్కొన్నారు. బుధవారం సావిశెట్టిపల్లె రైతు సేవా కేంద్రం పరిధిలో సాగుచేసిన ఉల్లి పంటను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్‌లో 14 వేల ఎకరాలలో ఉల్లి పంట సాగు చేస్తున్నారన్నారు. ప్రస్తుతం కేపీ ఉల్లితో పాటు పెద్ద బళ్లారి, చిన్నబళ్లారి రకాలు సాగులో ఉన్నాయని.. పంట ప్రారంభం నుండే రైతులు సంకర రకాలను ఎంచుకొని అధికారుల సూచనలను పాటిస్తూ ముందుకు సాగాలన్నారు. బిందు సేద్య పరికరాలకు ప్రభుత్వం 50 నుంచి 90 శాతం సబ్సిడీ వరకు అందిస్తుందని.. వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతు స్థాయిలో పంట నిల్వచేసుకొనే గోదాములు లేకపోవడం వలన ఉల్లి పంట కోసిన వెంటనే అమ్ముకోవాల్సి వస్తుందని, ఆసమయంలో సరైన ధరలు లేకపోతే రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఉద్యానశాఖ 50 శాతం సబ్సిడీతో ఉల్లి నిల్వ గోదాముల నిర్మాణం కోసం ముందుకు వచ్చిందని.. ఈఅవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి రైతు తాను సాగుచేసిన పంటను తప్పక ఈక్రాఫ్ బుకింగ్ చేసుకోవాలని, పంట నమోదే అన్ని రకాల సహకారాలకు ప్రామాణికంగా తీసుకోవడం జరుగుతుందని తెలిజేశారు. కార్యక్రమంలో స్థానిక ఉద్యానాధికారి శ్రీనివాసులరెడ్డి, పలువురు సిబ్బంది, రైతుల పాల్గొన్నారు.

ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా కృషి చేయాలి

- పోలీసుల సమీక్షలో జడ్జి బాబాపక్రుద్దీన్



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి బాబాపక్రుద్దీన్

కడప రూరల్, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు ఉమ్మడి కడప జిల్లాలో సెప్టెంబర్ 13న నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌లో పోలీస్‌శాఖ నుంచి అధిక కేసులు రాజీ అయ్యేలా కృషి చేయాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాపక్రుద్దీన్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాసదన్‌లో డీఎస్పీలతో ముందస్తు లోక్ అదాలత్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఎలాంటి ఖర్చు లేకుండా కక్షిదారులకు సత్వర న్యాయసేవలందించే లక్ష్యంతో సుప్రీం కోర్టు 1987లో న్యాయసేవాధికార సంస్థల చట్టాన్ని రూపొందించిందన్నారు. ఇలాంటి ప్రాముఖ్యత కలిగిన లోక్ అదాలత్ ను సెప్టెంబర్ 13న ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా నిర్వహించడం జరుగుతోందన్నారు. ఈ మేరకు జిల్లా పోలీస్‌శాఖ నుంచి అత్యధిక కేసులు రాజీ అయ్యేలా తగు చర్యలు చేపట్టాలన్నారు. గత లోక్ అదాలత్ కంటే ఈసారి ఎక్కువ కేసులు పరిష్కరించేలా సహకరించాలన్నారు. లోక్‌అదాలత్ ప్రాముఖ్యతను కక్షిదారులకు వివరించాలన్నారు. వ్యక్తుల మధ్య తగాదాలను రాజీమార్గం ద్వారా పరిష్కరించడానికి పోలీసుల తోడ్పాటు చాలా అవసరమన్నారు. కక్షిదారులు లోక్ అదాలత్‌లో రాజీపడేలా అవగాహన కల్పించాలన్నారు. లోక్ అదాలత్‌లో పరిష్కారం అయ్యే కేసులకు ఎటువంటి ఖర్చు ఉండదన్నారు. సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. ఇక్కడ పరిష్కారం అయిన కేసు సుప్రీం కోర్టు తీర్పుతో సమానమైందన్నారు. తిరిగి అప్పీల్‌కు వెళ్లడానికి వీలుపడదన్నారు. లోక్ అదాలత్ పరిధిలోకి రాని కేసులంటూ ఏవీ లేవ న్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ల వారీగా కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో రాజంపేట ఆడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ యనోజ్ హెగ్డే, కడప, మైదుకూ రు, ప్రొద్దుటూరు, రాయచోటి సబ్ డివిజనల్ పోలీసు అధికారులు ఏ.వెంకటేశ్వర్లు, జి.రాజేంద్రప్రసాద్, పి.భావన, ఆర్.కృష్ణమోహన్, కడప కోర్టు మానిటరింగ్ సెల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పులివెందుల కళాశాలలో సమస్యలు పరిష్కరించండి

- జేఎన్‌టీయూఏ వీసీకి మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి వినతి

అనంతపురంరూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూఏ అనుబంధమైన పులివెందుల ఇంజనీరింగ్ కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి కోరారు. ఆ మేరకు ఆయన అనంతపురంలోని జేఎన్‌టీయూఏ వీసీ సుదర్శన్‌రావును బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. కళాశాలలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి కార్యక్రమాలు, పనుల గురించి చర్చించారు. రాబోయే కాలంలో యూనివర్శిటీ సర్వతోముఖాభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు పూర్తిగా ఉంటాయని పేర్కొన్నారు.



జేఎన్‌టీయూఏ వీసీకి వినతి పత్రం ఇస్తున్న బీటెక్ రవి

మెనూ ప్రకారమే భోజనం

- సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టరు

కడప ఎన్టీఆర్‌సర్కిల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మెనూ ప్రకారమే విద్యార్థులకు హాస్టళ్లలో భోజన వసతి కల్పిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టరు కె.సరస్వతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

'మెనూ అలా .. ధరలు ఇలా .. అమలు ఎలా' అనే శీర్షికతో గత నెల 29న ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనానికి ఆమె స్పందించారు. జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులకు ప్రభుత్వ నిర్దేశిత మెనూ ప్రకారం భోజన వస తి కల్పించడం జరుగుతుందని వివరించారు. అదేవిధంగా సహా య సాంఘిక సంక్షేమ అధికారుల ద్వారా విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో వేంకటేశ్వరస్వామికి పూజలు



ఆలయంలో శాస్త్రోక్తంగా పవిత్ర పూజలు

జమ్మలమడుగు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు నారాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ఆలయ పండితులు, అధికారులు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. పవిత్ర సమర్పణ కార్యక్రమాల్లో భాగంగా ఉదయం స్వామివారిని సుప్రభాత పూజతో ప్రారంభించి యాగశాలలో పుణ్యాహవాచనం, కుంభ ఆరాధన, తదితర పూజలు, హోమాలు చేశారు. అనంతరం యాగశాలలో పవిత్ర మాలలకు ఉపచారాలు నిర్వహించి ప్రదక్షిణగా స్వామివారి సన్నిధికి చేర్చారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో ప్రశాంతి, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణపై విచారణ

- కర్నూలుకు గర్భిణుల తరలింపు
- ప్రొద్దుటూరులో ఏజెంట్ల దందా వాస్తవమే
- వివరాలు వెల్లడించిన డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ గీత

ప్రొద్దుటూరు రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎన్నో హెచ్చరికలు.. తనిఖీలు.. డయాగ్నోస్టిక్ సెంటర్లు, నర్సింగ్‌హోంల నిర్వహణపై నిఘా.. దళారీ వ్యవస్థపై డెకాయి ఆపరేషన్... ఇలా ఎన్ని చర్యలు చేపట్టినా లింగ నిర్ధారణ వెల్లడి దందా ఆగడంలేదు. ఈ వ్యవహారంపై జూలై 20వ తేదీ 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో 'లోకం చూడకనే... అనంత లోకాలకు...!' అనే కథనం ప్రచురితం అయింది. బహిరంగంగా సాగుతున్న ఈ బ్రోకర్ల దందా వ్యవహారంపై వైద్యాధికారులు తనిఖీలు చేసి వీటిని అరికట్టేందుకు డెకాయి ఆపరేషన్ కొనసాగిస్తామని వెల్లడించారు. ఈ వ్యవహారంలో అందిన ఫిర్యాదుల మేరకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారుల ఆదేశాలతో బుధవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ గీత ప్రొద్దుటూరులో దర్యాప్తు చేపట్టారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానికంగా లింగ నిర్ధారణ కట్టడి అయిందని, అయితే కొంతమంది దళారులు గర్భిణులను ఇక్కడి నుంచి కర్నూలుకు తరలిస్తున్నారనే విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. రూ.15వేలకు లింగ నిర్ధారణను దళారులు చేయిస్తున్నారని నిర్ధారణ అయినట్లు చెప్పారు. ప్రొద్దుటూరుకు చెందిన ఓ మహిళకు ఇది వరకే ముగ్గురు ఆడపిల్లల సంతానం. తన నాలుగవ కాన్పులో అయినా మగబిడ్డ కావాలనే ఉద్దేశ్యంతో లింగనిర్ధారణ వెల్లడి కోసం బద్వేలుకు చెందిన లత అనే ఏజెంట్ ద్వారా ప్రొద్దుటూరులోని స్టాఫ్ నర్సు రూతుని సంప్రదించారని చెప్పారు. జమ్మలమడుగు రోడ్డులోని ఓ ప్రైవేటు నర్సింగ్‌హోంలో పనిచేస్తున్న రూతు ఆ గర్భిణిని కర్నూలులోని ప్రసాద్ అనే ఏజెంట్ వద్దకు పంపారన్నారు. అతను ఓ ప్రైవేటు ఆస్పత్రిలోకి తీసుకెళ్లి స్కానింగ్ చేయించారన్నారు. అయితే ఆమె గర్భం దాల్చి కేవలం ఆరు వారాలు మాత్రమే కావడంతో లింగ నిర్ధారణ వెల్లడి కష్టమని.. మరో నెల తర్వాత లింగ నిర్ధారణ చేస్తామని కొంత మొత్తం డబ్బులను వసూలు చేసుకుని తిరిగి పంపించారన్నారు. అయితే ప్రొద్దుటూరుకు వచ్చిన ఆ గర్భిణికి అబార్షన్ అయిందన్నారు. ఆర్థికంగా వారు పేదవారు కావడంతో రూ.15 వేల కోసం రూతును నిలదీశారు. ఈ నేపథ్యంలో అందిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేయగా ఇక్కడి ప్రైవేటు ఆస్పత్రికి ఎలాంటి సంబంధాలు లేవని చెప్పారు. అయితే ఏజెంట్ల ప్రమేయం నిర్ధారణ అయినట్లు డాక్టర్ గీత వెల్లడించారు.



స్టాఫ్ నర్సు రూతుని విచారిస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో గీత

ఏజెంట్లకోసం గాలింపు

ప్రొద్దుటూరు కేంద్రంగా సాగుతున్న లింగ నిర్ధారణ వెల్లడిలో కీలకపాత్ర పోషిస్తున్న నర్సులు, వైద్యరంగంలో ప్రమేయం ఉన్న మహిళలు ఏజెంట్ల అవతారం ఎత్తిన వ్యక్తుల గుట్టు రట్టు చేసేందుకు క్షేత్రస్థాయిలో దర్యాప్తు చేపట్టామని వైద్యాధికారులు చెప్పారు. స్థానిక నర్సు రూతు, కర్నూలుకు చెందిన ఏజెంటు ప్రసాదు వివరాలను జిల్లా వైద్యాధికారుల దృష్టికి తీసుకెళ్లగా వారు కర్నూలు జిల్లా డీఎంఅండ్‌హెచ్‌వోను అప్రమత్తం చేశారన్నారు. రెండు జిల్లాలకు చెందిన వైద్యాధికారులు ఏజెంట్లను పట్టుకునే చర్యలను చేపట్టినట్లు వివరించారు. చాపకింద నీరులా సాగుతున్న ఈ దందాపై స్పష్టమైన ఆధారాలతో తమకు సమాచారం ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె కోరారు.

నష్టాల బాటలో నర్సరీలు

● నాలుగేళ్లుగా పుంజుకోని వ్యాపారం ● ఆగిన ఎగుమతులు
● కోట్లాది రూపాయల నష్టం ● ఆందోళనలో నిర్వాహకులు



విక్రయానికి సిద్ధంగా ఉన్న చీనీ అంట్లు

రైల్వేకోడూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మార్కెటింగ్ లేక చీనీ అంటు మొక్కల వ్యాపారం నాలుగేళ్లుగా డీలా పడింది. దీంతో నర్సరీ నిర్వాహకులు తీవ్ర ఇబ్బందుల్లో పడ్డారు.

రైల్వేకోడూరు మండలంలోని గుండాలపల్లె, శింగిరివారిపల్లె, బయనపల్లె, ఓబనపల్లె గ్రామాల్లో .వంద సంవత్సరాల నుంచి చీనీ అంటు మొక్కలు తయారీ చేసి ఇటు ఆంధ్ర, అటు తెలంగాణా రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. ఒక్కో మొక్క రూ.40 నుంచి రూ. 50 చొప్పున ప్రతి సీజన్‌లో లక్షలాది మొక్కలను రెండు రాష్ట్రాలకు ఎగుమతి చేసేవారు. దీంతో నర్సరీ నిర్వాహకులతోపాటు వందలాది మంది కూలీలకు జీవనోపాధి లభించేది. ప్రభుత్వం కూడా ఉపాధి హామీ పథకం ద్వారా చీనీ మొక్కలను కొని రైతులకు పంపిణీ చేసేది. గత నాలుగేళ్లుగా ప్రభుత్వం చీనీ మొక్కలు కొనుగోలు చేయకపోవడంతో వ్యాపారం డీలా పడిపోయింది. దీంతో వ్యాపారులు, కూలీలు తీవ్రంగా ఇబ్బందులు పడడమే కాక లక్షలాది మొక్కలు నర్సరీల్లో మిగిలిపోయాయి. ఈ ఏడాది మళ్లీ 20 లక్షల మొక్కలు సిద్ధం చేశారు.

తగ్గిన ఎగుమతులు

స్థానిక నర్సరీ యజమానులు ప్రతి సీజన్‌లో రోజుకు 10 నుంచి 20 లారీల్లో అంటు మొక్కలను ఎగుమతి చేసే వారు. ప్రస్తుతం ఒక్క లారీ కూడా ఎగుమతి చేసే పరిస్థితి లేకుండా పోయిందని వాపోతున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అంటు మొక్కల నర్సరీ వ్యాపారులను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

మొక్కలు కొనుగోలు చేయాలి



ప్రభుత్వం నర్సరీలను ప్రోత్సహించాలిఉపాధిహామీ పథకం కింద చీనీ మొక్కలను రైతులకు అందించే విధానాన్ని పునరుద్ధరించాలి.

- పగడాల విశ్వనాథ్, నర్సరీ నిర్వాహకుడు

నష్టాలొస్తున్నాయి



రూ. 7లక్షలు పెట్టుబడి పెడితే రూ. 70 వేలు వచ్చింది. అప్పులపై వడ్డీలు తడిసి వడ్డీలు మోపెడవుతున్నాయి. నాలుగేళ్లుగా నర్సరీల నిర్వహణ కష్టంగా మారింది

- పగిడి బాబు, నర్సరీ నిర్వాహకుడు

ప్రకృతి సాగుపై ప్రత్యేక దృష్టి

● డీఏవో శివనారాయణ



ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న డీఏవో శివనారాయణ

గాలివీడు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు డీఏవో శివనారాయణ తెలిపారు. బుధవారం గాలివీడులో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏడీఏ జయ రాణితో కలిసి ఆయన మాట్లాడుతూ ఐదు ఎకరాలు కలిగిన ప్రతి రైతు కనీసం ఒక ఎకరంలో నైనా ప్రకృతి సాగు చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలు, సాంకేతిక సలహాలు, యాంత్రీకరణ, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించడంపై వివరించారు. అనంతరం క్షేత్రస్థాయిలో పొలాలను సందర్శించి సాగులో యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు, చీడపీడల నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ ఏవో నవంత్, రైతులు పాల్గొన్నారు.

వరిలో కాలిబాటలతో అధిక దిగుబడులు

● ఏపీఎం ఖాదర్‌వలి



వరినారును పరిశీలిస్తున్న ఏపీఎం ఖాదర్‌వలి

వీరబల్లి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): వరిలో కాలిబాటల వల్ల మంచి దిగుబడి వస్తుందని వెలుగు ఏపీఎం ఖాదర్‌వలి తెలిపారు. బుధవారం కమ్మపల్లి రాంప్రసాద్ రైతు పొలంలో వరినాట్లు పరిశీలించారు. వీరబల్లి, సోమవరం గ్రామాలను సమీకృత వ్యవసాయ పథకంలో తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వరినారు కొనలు కత్తిరించడం వల్ల ఎక్కువ పిలకలు వస్తాయన్నారు. కాలిబాటలు ఉంచడం వల్ల మొక్కకు కావాల్సిన గాలి, వెలుతురు అంది చీడపీడలకు అవకాశం తగ్గుతుందన్నారు. వరి పొలంలో అజోల వేయడం వల్ల మంచి పోషకాలు అందుతాయన్నారు. ఎఫ్‌పీవో సీసీ గంగాధరం, మండల యాంకర్ పర్సన్ అనిత, సీఆర్‌పీ రెడ్డెమ్మ, ఫార్మర్ మిత్ర వెంకటేశ్ స్థానిక రైతులు పాల్గొన్నారు.

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పౌష్టికాహార పక్షోత్సవాలు



పక్షోత్సవాల కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

సిద్దవటం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సిద్దవటం మండలం భాకరాపేట సమీపాన ఉన్న పోలీసు పటాలయం జిల్లా పరిషత్ హైస్కూల్లో బుధవారం పౌష్టికాహార పక్షోత్సవాల పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ దివ్యరాణి మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మన పిల్లలే మనఆస్తి వారి భవిష్యత్ ఆరోగ్య విధానాన్ని కాపాడే నినాదంతో కరపత్రాలను పంపిణీ చేశామని, ఈనెల 15వ తేదీ వరకు పౌష్టికాహార పక్షోత్సవాలు జరుగుతాయని తెలిపారు.

ఆరోగ్య కరమైన ఆహారం వల్ల కలిగే లాభాలను విద్యా ర్థులకు తెలిపామని, పౌష్టికాహారం తీసుకోకపోతే పిల్లలు, బలహీనత, ఎదుగుదల లోపం వంటి అనేక వ్యాధులకు గురవుతారని తెలిపారు. విద్యార్థులు పౌష్టికాహారం తీసుకునేముందు చేతులు శుభ్రపరచుకోవాలని, పాలు, గుడ్లు, ఆకుకూరలు తినడం వల్ల విటమిన్స్, రక్తహీనత వృద్ధి చెంది పూర్తిగా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు షామీర్‌బాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు ప్రభుత్వ లక్ష్యం

● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



మంత్రి మండిపల్లికి స్వాగతం పలుకుతున్న రాజులకాలనీవాసులు

చిన్నమండెం, సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం బోరెడ్డిగారిపల్లెలోని ఆయన స్వగృహంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా కొంత మంది అధికారులు, నేతలు, ప్రజలు మంత్రికి దుశ్శాలువాలు, పుష్పగుచ్చంతో సత్కరించి సన్మానించారు.

సీసీ రోడ్డు పనులకు భూమిపూజ

రాయచోటిటౌన్: రాయచోటి పట్టణంలోని రాజులకాలనీలో బుధవారం సీసీ రోడ్డు పనులకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి భూమిపూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రాయచోటి మున్సిపాలిటీలో రోడ్లు, డ్రైనేజీలు అభివృద్ధి చేసి నెంబర్ వన్‌గా తీర్చిదిద్దుతామన్నారు. పట్టణంలోని సంకటహర గణపతి ఆలయంలో బుధవారం వినాయకుడి కల్యాణం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ గండికోట సుధాకర్ ఆధ్వర్యంలో అర్చకులు రాంప్రసాద్‌శర్మ, చక్రపాణి ఆలయంలో అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం సిద్ది, బుద్ధిలతో వినాయకుడి కల్యాణం చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి హాజరై మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మండిపల్లి అభిమానులు, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధికి కూటమి ప్రభుత్వం తొలి ప్రాధాన్యం

● ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే అరవ శ్రీధర్



సీసీ రోడ్డుకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే, కుడా చైర్మన్

పుల్లంపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామీణాభివృద్ధి కూటమి ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ తెలిపారు. బుధవారం కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డితో కలిసి ఆయన మండల పరిధిలోని బావికాడపల్లె పంచాయతీ రామలింగాపురంలో సిమెంటు రోడ్లకు భూమి పూజ చేశారు. అనంతరం దక్షిణంపల్లెలో గ్రావెల్ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పల్లెల్లో రోడ్డు నిర్మాణాలు, తాగునీటి వసతి, వైద్య సదుపాయం వంటి మౌలిక వసతుల ఏర్పాటుకు తొలి ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి మాట్లాడుతూ అన్ని గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పిస్తామన్నారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రామచంద్రనాయుడు, టీడీపీ నాయకులు కాపెర్ల చంద్రశేఖర్ నాయుడు, ఆరె సుధాకర్‌నాయుడు, జనార్దన్‌నాయుడు, సింగం ఆదినారాయణరెడ్డి, రాజారెడ్డి, జనసేన ఇన్‌చార్జి పి.వెంకటసుబ్బయ్య, ముద్దా సుబాష్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య యాదవ్, పోలూరు కృష్ణమనాయుడు, మారోతు మల్లి తదితరులు పాల్గొన్నారు.

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

సిద్దవటం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని అడల్ట్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి రమాదేవి పిలుపునిచ్చారు. స్థానిక ఎంపీడీవో సభాభవనంలో బుధవారం అక్షర ఆంధ్ర, ఉల్లాస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కడప జిల్లాలోని కుప్పవారిపల్లెను ఒకప్పుడు కలెక్టర్ ఫరిదా తీసుకొని నిరక్షరాస్యులను గుర్తించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దారని ఆయనను స్ఫూర్తిగా తీసుకొని సిద్దవటం మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రతిఒక్కరికి అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం సుజాత, ఎడ్యుకేషనల్ సూపర్‌వైజర్ నరసారెడ్డి, మండల విస్తరణాధికారి మెహతాజ్‌యాస్మిన్, ఏపీవో నరసింహులు, అంగన్వాడీ సూపర్‌వైజర్ శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు

పత్తుమియా మసీద్‌లో ఉరుసు



ప్రవక్తల వస్తువులు ప్రదర్శిస్తున్న మత పెద్దలు

సిద్దవటం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : అసార్-ఏ-షరీఫ్‌లో భాగంగా మండల కేంద్రంలోని పత్తుమియా మసీదులో బుధ వారం రాత్రి ఉరుసు నిర్వహించినట్లు ముత్తవల్లి సయ్యద్ అబ్దుల్ అజీస్ ఖాద్రి తెలిపారు. ఈ సందర్భంగా మహమ్మద్ ప్రవక్త , ఆయన కుమార్తె ఆయేషా అల్లుడైన హజరత్ అలీ, వారి మనవడు ఇమాం హుస్సేన్‌కు సంబంధించిన వస్తు విశేషాలు ప్రదర్శించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిజారే ఆలం ఖాద్రి, ఇమాంపీర్‌బాషా ఖాద్రి పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ఒంటిమిట్ట సీఐ బాబు ఆధ్వర్యంలో సిద్దవటం ఏఎస్ఐ బాబయ్య బందోబస్తు నిర్వహించారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవు

రాయచోటి(నేతాజీ సర్కిల్), సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి హెచ్చరించారు. బుధవారం బుర్రావాండ్లపల్లెలో సర్వే నెంబర్ 162/5లోని ప్రభుత్వ భూమిని అదే గ్రామానికి చెందిన గోపగాని రెడ్డెయ్య అనే వ్యక్తి ఆక్రమించాడని ఫిర్యాదులు రావడంతో సంబంధిత భూమిని సర్వే చేసి ప్రభుత్వ భూమిగా గుర్తించి హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశామన్నారు. ఆ భూమిని ఎవరైనా ఆక్రమించిన, అక్రమ కట్టడాలను నిర్మించిన చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి : డీఈ

పుల్లంపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : వివిధ దశల్లో ఆగిపోయిన పక్కా గృహాల నిర్మాణాను వెంటనే పూర్తి చేయాలని హౌసింగ్ డీఈ మురళీ సూచించారు. బుధవారం ఆయన జాగువారిపల్లె దళవాయిపల్లె, కొత్తపేట, అనంతంపల్లె లేఅవుట్‌లలో లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ, బీసీ లబ్ధిదారులకు అదనంగా నిధులు మంజూరు చేస్తుందని, నిర్మాణాలు పూర్తి చేసి త్వరలో జరిగే గృహ ప్రవేశాలకు శ్రీకారం చుట్టాలన్నారు. ఎంపీడీవో జయశ్రీ సహకారంతో అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ప్రభుత్వ లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. హౌసింగ్ ఏఈ విజయ్‌కుమార్, సీవో గౌస్‌ఖాన్ పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయ ఏవో బాధ్యతల స్వీకరణ

సిద్దవటం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సిద్దవటం మండల అభివృద్ధి కార్యాలయంలో పరిపాలన అదికారిగా విధులు నిర్వహిస్తున్న లక్ష్మీదేవి అన్నమయ్య జిల్లా మెప్మా పీడీగా బదిలీ కావడంతో ఒంటిమిట్ట ఎంపీడీవో కార్యాలయ ఏవో సోమశేఖర్ సిద్దవటం ఎంపీడీవో కార్యాలయానికి బదిలీ అయ్యారు. బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

చలో విజయవాడ జయప్రదం చేయండి

రాజంపేట టౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగ సమస్యల పరిష్కారంపై ఈ నెల 6న విజయవాడలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహి స్తున్న కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలి రావా లని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మదన్ మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని ఐటీఐ కళాశాల ఆవరణలో చలో విజయవాడ గోడపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు కావస్తున్నా నేటికీ విద్యా రంగ సమస్యలను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పట్టించుకోవడంలేదన్నారు. ఎస్ ఎఫ్ఐ హర్షవర్ధన్, బాబు, మహేష్, మనోజ్, శివ, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

వినాయకుడికి సుగవాసి ప్రసాద్‌బాబు పూజలు

రాయచోటిటౌన్, సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు వినాయక మండపాల్లో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు బుధవారం పూజలు నిర్వహించి భక్తులకు అన్నదానాలు చేశారు. ఆయా ఉత్సవ కమిటీల సభ్యులు ఆయనకు ఘనస్వాగతం పలికి పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.

రూ.2.70 లక్షలు పలికిన వినాయకుడి లడ్డూ

రాజంపేట టౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నారపురెడ్డిపల్లెలో పిండిబోయిన రాముయాదవ్ సోదరులు రూ.2.70 లక్షలకు స్వామివారి లడ్డూను దక్కించుకున్నారు. ఆయనను గ్రామ పెద్దలు, ప్రజలు అభినందించారు.

నందలూరు : మండలంలోని ఎన్టీఆర్ నగర్ వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడిని కన్యకచెరువులో నిమజ్జనంచేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన వేలంలో వేలు పలికింది. ఎన్టీఆర్ నగర్‌కు చెందిన రేగిమడుగు సుబ్బారావు లడ్డూ రూ.45 వేలకు దక్కించుకున్నారు. ఆయనను మేళతాళాల నడుమ ఊరేగింపుగా ఇంటికి తీసుకెళ్లారు.

ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా ఒంటిమిట్ట



సమావేశంలో మాట్లాడుతున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

ఒంటిమిట్ట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్టను ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని రాజంపేట టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అక్కిశెట్టి లక్ష్మీదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ వచ్చే నాలుగు సంవత్సరాల్లో ఒంటిమిట్ట మరింత అభివృద్ధి చెందు తుందన్నారు. ఒంటిమిట్టకు రాష్ట్ర గుర్తింపు ఇచ్చింది చంద్రబాబునాయుడేన న్నారు. శ్రీరామ ఎత్తిపోతల పథకం పనులకు సంబంధించి రూ.12 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభించి చెరువుకు సాగునీరు అందిస్తామన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి మండల అభివృద్ధికి కృషి చేయాలన్నారు కొత్త మాధవరంలో ఇళ్ల పట్టాలు ఇచ్చారు. కాని స్థలాలు చూపించలేదన్నారు. వెంటనే రెవెన్యూ అధికారులు ఇంటి స్థలాలను చూపించాలన్నారు. అంతకుముందుగా ఆయా శాఖాధికారు లు తాము చేసిన అభివృద్ధి పనులను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుజాతమ్మ, జడ్పీటీసీ సభ్యుడు ముద్దు కృష్ణారెడ్డి, మండల ఉపా ధ్యక్షులు నల్లగొండ లక్ష్మీదేవి, బోగా గీతాదేవి, మండల టీడీపీ నాయకులు ఎన్వీ రమణ, గజ్జల నరసింహారెడ్డి, బొబ్బిలి రాయుడు, నల్లగొండ వెంకట సుబ్బారెడ్డి, సాలాబాదు బుజ్జి, ఎంపీటీసీ సభ్యుడు సుంకేసుల బాషా, బొడ్డే రమణ, గజ్జల శ్రీనివాసులరెడ్డి, హరినాథ్‌రెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు



మాట్లాడుతున్న ఎంపీడీవో ఉషారాణి

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహించ వచ్చునని ఎంపీడీవో ఉషా రాణి తెలిపారు. బుధవారం ఏపీ మోడల్ స్కూల్‌లో నిర్వహించిన ఫ్రెషర్స్‌డే కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటర్మీడియట్‌లోనే ఏం చదివినా అదే జీవితంలో నిలబడుతుందని డాక్టర్, ఇంజనీర్, ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఉన్నత పదవులు దృష్టిలో పెట్టుకొని చదువుకోవాలన్నారు. ఈ పాఠశాలలో చదివిన విద్యార్థులు ఎంతో మంది మంచి ఉద్యోగాలు సంపాదించారన్నారు. ప్రతి ఒక్కరూ బాగా చదివి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, మన ఊరికి మంచిపేరు తేవాలని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ రమేశ్, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ యనమల మణి, విశ్వనాథ్, వైస్ ప్రిన్సిపాల్ రాజకుమార్, సంబేపల్లె మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ దిలీప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి దైవంతో సమానం



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న మండల విద్యాశాఖ అధికారులు

సుండుపల్లె, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తి దైవంతో సమానం అని మండల విద్యాశాఖ అధికారులు వెంకటేశ్‌నాయక్, రవీంద్ర నాయక్ తెలిపారు. బుధవరం రాయవరం క్లస్టర్ పరిధిలో బదిలీ అయిన 27 మంది ఉపాధ్యాయులను బుధవారం రాయవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్తమ సేవలందించిన ఉపాధ్యా యులకు గుర్తింపుతో పాటు సమాజంలో విలువ పెరుగుతుందన్నారు. దైవంతో సమానంగా భావించే ఉపాధ్యాయ వృత్తికి న్యాయం చేయడం మనం దరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో అమృనాయక్, నాగరాజు నాయక్, ఆర్‌జేయూపీ మండల అధ్యక్షులు సిద్దునాయక్, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయు లు, విద్యార్థులు పాల్గొన్నారు.

12వ పీఆర్‌సీని వెంటనే నియమించాలి



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు

సుండుపల్లె, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 12వ పీఆర్‌సీని వెంటనే ఏర్పాటు చేయాలని ఎస్టీయూ స్టేట్ మైనార్టీ కోకన్వీనర్ ఆరీఫుల్లా తెలిపారు. బుధవారం మండలంలోని తిమ్మసముద్రం, సుండుపల్లె, మడితాడు, రాయవరం క్లస్టర్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీఆర్‌సీ ఏర్పాటులో ఇప్పటికే 25 నెలలు ఆలస్యమైందని తెలియపరిచారు. ఐఆర్‌ను ప్రకటించాలని డిమాండ్ చే:శారు. కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయ, ఉద్యోగులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు రవీంద్రనాథ్‌రెడ్డి, ఆంజనేయులు, ఇస్మాయిల్, గణపతి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఎదుగుదలలోనే ఉపాధ్యాయుడి విజయం

గాలివీడు, సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత స్థాయికి ఎదిగినప్పుడే ఉపాధ్యాయుడు తన వృత్తిలో విజయం సాధించినట్లని ఎంఈవో-1 నాగరాజు తెలిపారు. బుధవారం గోరాన్‌చెరువు గ్రామంలోని దాసరివాండ్లపల్లె ప్రాథమిక పాఠశాలలో బదిలీపై వెళ్లిన సీనియర్ ఉపాధ్యాయుడు చిన్నకోట్ల రమణను పాఠశాల ఉపాధ్యాయులు దివ్యాంజనమ్మ, ఉలసల నాగరాజు ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 శ్రీనివాసులు, ఎగువ గొట్టివీడు హైస్కూల్ హెచ్‌యం సదాశివరెడ్డి, భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు సుబ్బరాయుడు, వివిధ సంఘాల నాయకులు, సీనియర్ ఉపాధ్యాయులు, దాసరివాండ్లపల్లె ప్రజలు, పాఠశాలకమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి రైతు ఈ క్రాప్‌లో నమోదు చేసుకోవాలి

రామాపురం, సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): పంట సాగు చేసిన ప్రతి రైతు ఈ క్రాప్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారిణి వై. నాగమణి సూచించారు. మండలంలోని హసనాపురం గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ క్రాప్ చేసుకున్న రైతులకు అన్నదాత సుఖీభవ అందుతుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయ వ్యవసాయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పైర్లను కోతుల నుంచి కాపాడాలి

సుండుపల్లె, సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): మండలంలోని పత్తివాండ్లపల్లెలో పైర్లను కోతులబారి నుంచి కాపాడేందుకు రెవెన్యూ, అటవీశాఖ అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని రాయచోటి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ మాజీ సభ్యుడు యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి బుధవారం ప్రకటన ద్వారా డిమాండ్ చేశారు. వంకాయ, వేరుశన తదితర పైర్లకు కోతులు తీవ్ర నష్టం కలుగజేస్తున్నాయని, పత్తివాండ్లపల్లె సమీపంలోని మామిడి తోటల్లో సుమారు 50 కోతుల గుంపు నివాసం ఏర్పాటు చేసుకొని రైతులకు చుక్కలు చూపిస్తున్నాయని తెలిపారు.

సీఎం పర్యటనతో ఒరిగిందేమీ లేదు : ఆకేపాటి

రాయచోటిటౌన్, సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి పర్యటనతో కోట్ల రూపాయల ప్రజాధనం వృథా తప్ప రాజంపేట ప్రజలకు ఒరిగింది ఏమీ లేదని అన్నమయ్య జిల్లా వైసీపీ అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి విమర్శించారు. బుధవారం ఆయన రాయచోటి పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కడప జెడ్పీ సమావేశంలో యూరియా గురించి ప్రశ్నిస్తే కొరత లేదని అధికారులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. హంద్రీ-నీవా జలాలు అన్నమయ్య జిల్లాకు తరలించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతు సమస్యలపై వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 9న రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్‌ల వద్ద నిరసన కార్యక్రమం చేపడతామన్నారు.

కట్టుదిట్టంగా రైతులకు యూరియా పంపిణీ చేయాలి : సబ్‌కలెక్టర్



అంకిశెట్టిపల్లె ఆర్‌ఎస్‌కే వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు

మదనపల్లెటౌన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాలు, ప్రైవేటు డీలర్లకు సరఫరా అయ్యే యూరియాను కట్టుదిట్టంగా రైతులకు పంపిణీ చేయాలని సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి ఆదేశించారు. బుధవారం అంకిశెట్టిపల్లె ఆర్‌ఎస్‌కే వద్ద యూరియా పంపిణీని సబ్ కలెక్టర్ పరిశీలించారు. రైతులకు ఎన్ని బస్తాలు ఇస్తున్నారు, ఎంత స్టాకు వచ్చింది తదితర విషయాలను ఏఓ నవీన్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. 12 మెట్రిక్ టన్నుల యూరియా స్టాకు వచ్చిందని పాసుపుస్తకాలు తీసుకొచ్చిన రైతులకు ఒక్కో బస్తా పంపిణీ చేస్తున్నామన్నారు. కేవలం మదనపల్లె మండల రైతులకు మాత్రమే యూరియా ఇస్తున్నామన్నారు. అంకిశెట్టిపల్లె టీడీపీ ఇన్‌చార్జి జంగాల రమణ సబ్‌కలెక్టర్‌తో మాట్లాడుతూ అంకిశెట్టిపల్లెలో రెవెన్యూ సమస్యలు ఎక్కువగా వున్నాయని, రీసర్వే చేసిన వ్పుడు రికార్డుల్లో భూముల వివరాలు తప్పుగా నమోదు చేశార న్నారు. రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పుల విషయమై రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. వీటన్నింటిపై అర్జీ రాసి తీసుకొస్తే విచారించి ప్రజలకు న్యాయం చేస్తామని సబ్‌కలెక్టర్ సూచించారు.

ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరించాలి

● డీపీఓ రాధమ్మ



పంచాయతీ అధికారులతో మాట్లాడుతున్న డీపీఓ రాధమ్మ

పీలేరు రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటి నుంచి రెండు రోజులకు ఒక సారి చెత్త సేకరించాలని డీపీఓ రాధమ్మ తెలిపారు. బుధవారం పంచాయతీలో చెత్త సేకరణపై ఆకస్మిక తనిఖీ చేపట్టిన ఆమె మాట్లాడుతూ శానిటేషన్‌పై తరచూ పీలేరు నుంచి ఫిర్యాదులు వస్తుంటాయని, ఇకపై సిబ్బంది, కార్మికులు పనితీరు మార్చుకోవాలని ఆదేశించారు. పంచాయతీలో 121 మంది వర్కర్లు ఉన్నప్పుడు ఇక సమస్య ఎందుకు ఉత్పన్నమౌతోందని ఇన్‌చార్జి ఈఓను ప్రశ్నించారు. క్షేత్ర స్థాయిలో పర్యటించాలని, కార్యాలయాలకే పరిమితమైతే ఇబ్బందులు తప్పవని చురకలం టించారు. తడి, పొడి చెత్తను విధిగా సేకరించాలన్నారు. పీలేరులో మినరల్ వాటర్ ప్లాంట్ల వర్కర్ల జీతాలు త్వరలోనే చెల్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి ఈఓ లతీఫ్ ఖాన్, ఇతర కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'హైవే' రైతులకు నగదు జమ

● ఖాతాల్లోకి విడతల వారీగా రూ.4.65కోట్లు



వేంపల్లెలో నేషనల్ హైవే రోడ్డు వేయనున్న భూములు ఇవే

వేంపల్లె, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాయచోటి-చాగలమర్రి నేషనల్ హైవే (440) రోడ్డుకు గానూ వేంపల్లెలో భూములు, ఇళ్లస్థలాలు కోల్పోయిన వారికి పరిహారం ఖాతాల్లో జమ అయింది. వేంపల్లె మండలానికి సంబంధించి కడప రోడ్డు నుంచి పాపాఘ్ని నదీ ఒడ్డు మీదుగా గండిరోడ్డులోని పాలిటెక్నికల్ కళాశాల వరకు 5 కిలోమీటర్ల మేర రోడ్డుకోసం భూములు, ఇళ్లస్థలాలను ప్రభుత్వం సేకరించింది. వ్యవసాయ భూములకు ఎకరాకు రూ.34.11 లక్షల చొప్పున, ఇళ్ల స్థలాల్లో ఎకరాకు రూ.1.95కోట్ల చొప్పున పరిహారం నిర్ణయించారు. మొదటి విడతగా మంగళవారం రూ.4.65 కోట్లు ఖాతాల్లో జమ అయింది. 42.80 ఎకరాల వ్యవసాయ భూమి 16ఎకరాల మేర ఇళ్లస్థలాలు కోల్పోతున్నారు. ఇందులో ఇళ్లస్థలాలకు రూ.23 కోట్ల దాకా రావాల్సి ఉంది. వారికి ఇంకా నగదు జమ చేయలేదు. వ్యవసాయ భూములకు సంబంధించి 42.80 ఎకరాలకు గాను రూ.25.70 కోట్లు రావాల్సి ఉండగా ప్రస్తుతం రూ.4.65 కోట్లు రైతుల ఖాతాల్లో జమ అయిందని నేషనల్ హైవే పర్యవేక్షణ ఇంజనీర్ సురేంద్ర తెలిపారు. మరికొద్ది రోజుల్లో మిగిలిన పరిహారం ఖాతాల్లో జమ అవుతుందన్నారు. ఈ రోడ్డును ఎస్ఎస్‌పీ సంస్థ టెండర్ దక్కించుకుంది. రైతులకు పరిహారం అందించిన తర్వాత పనులు మొదలుపెడతారని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

ప్రధాన చెరువులు నిండేనా...?

● కృష్ణా జలాల నీటి కోసం రైతుల ఎదురుచూపు

● పూర్తి కాని చెరువుల అనుసంధానం, కాలువ నిర్మాణ పనులు

పెద్దతిప్పసముద్రం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనే ప్రధాన చెరువులుగా ప్రఖ్యాతి గాంచిన చెరువుల్లో కందుకూరు వ్యాస రాయ, పెద్దతిప్పసముద్రం, తిప్పరాయ, రంగస ముద్రం రంగరాయ చెరువులు జిల్లాలోనే ప్రధాన చెరువులుగా మంచి గుర్తింపు పొందాయి. ఈ మూడు చెరువుల్లో నీరు ఉంటే ఏడాదికి మూడు పంటలు పుష్కలంగా పండుతాయి. అయితే వర్షాభావం కారణంగా చెరువుల్లోకి నీరు రావడం లేదు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పడమటి మండలాల్లో ఒక్కటైన పెద్దతిప్పసముద్రం మండలంలోని ఈ మూడు చెరువులను కృష్ణాజలాలతో నింపాలని కందుకూరు వ్యాసరాయ సముద్రం చెరువు, పెద్దతిప్పసముద్రం తిప్పరాయసముద్రం సముద్రం చెరువులకు అను సంధాన కాలువ పనులు ప్రారంభించారు. అయితే ఆ కాలువ నిర్మాణ పనులు ఎక్కడికక్కడ నిర్మాణ దశలోనే ఆగిపోయాయి. గత వైసీపీ ప్రభుత్వంలో చెరువులను నింపుతామని అరకొరగా కాలువల్లో నీటిని విడుదల చేసి మిన్నకుండి పోవడంతో చెరు వుల్లోకి నీరు విడుదల కలగానే మిగిలిపోయింది.



కందుకూరు వ్యాసరాయ సముద్రం చెరువు (ఫైల్)



పెద్దతిప్పసముద్రం తిప్పరాయసముద్రం చెరువు (ఫైల్)

పూర్తి కాని కందుకూరు చెరువు ఎత్తిపోతల పనులు

కందుకూరు వ్యాసరాయసముద్రం చెరువు జిల్లా లోనే అతిపెద్ద చెరువుల్లో ఒకటి. ఈ చెరువు 369.8 ఎంసీఎఫ్‌టీ సామర్థ్యం. ఎత్తిపోతల పథకం ద్వారా హంద్రీ-నీవా జలాలను ఈ చెరువును నింపాలనే ఉద్దేశ్యంతో కాలువ నిర్మాణాన్ని చేపట్టారు. అయితే ఆ కాలువ నిర్మాణం పనులు పూర్తి కాకుండానే అర్ధంతరంగా నిలిచిపోయాయి. గత వైసీపీ ప్రభు త్వంలో కుప్పంకు నీటిని తరలిస్తున్నాం అని నానా యాగీ చేసి కాలువల్లో నీటిని వదిలి చెరువులన్నీ నింపి వ్యవసాయ భూములను సస్యశ్యామలం చేస్తామని వైసీపీ ప్రభుత్వం బీరాలు పలికింది. హంద్రీనీవా పుంగనూరు బ్రాంచి కెనాల్ పరిధిలోని తంబళ్లపల్లె, మదనపల్లె, పుంగ నూరు నియోజకవర్గాల్లో 78 చెరువులకు కాలువ ద్వారా కృష్ణా జలాలు అందించాల్సి ఉన్నా ఆ ప్రయత్నాన్ని చేపట్ట లేదు. వేల కోట్లు ఖర్చు చేసి హంద్రీనీవా సుజలస్రవంతి కాలువలను నిర్మించారు. వైసీపీ ప్రభుత్వం ఎత్తిపోతల పథ కాలు, కాలువల నిర్మాణాలకు ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు. అయితే తరువాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఒకేసారి రూ.3800 కోట్లు మంజూరు చేసి లైనింగ్ పనులను పూర్తి చేసి కాలు వలకు నీటిని విడుదల చేయడంతో రైతుల్లో ఆనందం నెలకొంది. గత ప్రభుత్వంలో చేయలేని పనిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసి చూపించాడని కనీసం ఈ కూటమి ప్రభుత్వంలో నైనా పడమటి మండలాల్లో ఉన్న ఈ మూడు ప్రధాన చెరువులకు నీటిని విడుదల చేస్తారని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

కృష్ణా జలాలతో చెరువులను నింపండి

చెర్లోపల్లె రిజర్వాయర్ నుంచి 7 లిఫ్టుల ద్వారా పుంగనూరు బ్రాంచి కెనాల్ మీదుగా అప్పినపల్లెకు, అక్కడి నుంచి కుప్పం ప్రాంతంలోని పరమస ముద్రం చెరువుకు నీటిని తరలించేందుకు రెండు నెలలు పట్టింది. అయితే కూటమి ప్రభుత్వం కాలు వలకు లైనింగ్ పనులను చేపట్టడంతో కృష్ణజలాలు అత్యంత వేగంగా కుప్పంకు తరలి వెళుతుండడంతో రైతుల్లో ఆశ చిగురిస్తోంది. చెర్లోపల్లె రిజర్వాయర్ నుంచి 150-200 క్యూసెక్కుల నీటిని విడుదల చే సినా కుప్పంకు 10 క్యూసెక్కుల నీరు కూడా గతంలో చేరలేదు. సుమారు 400 కిలోమీటర్ల దూరం ప్రవహించాల్సి ఉన్నందున గతంలో నీరు వేగంగా సాగకపోవడంతో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం నెరవేరలేదు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కాలువలకు లైనింగ్ పనులు చేయడంతో నీరు వేగంగా కుప్పం చేరుకుంటోంది. కుప్పం చెరువులు నిండాక కనీసం ఈసారైనా పెద్ద తిప్పసముద్రం మండలంలో ఉన్న ప్రధాన చెరువు లను నీటితో నింపుతారా లేదా అని రైతులు ఎదురు చూస్తున్నారు.

ప్రధాన చెరువులకు జలాలు విడుదల చేయండి

పెద్దతిప్పసముద్రం మండలంలోని ప్రధాన చెరువు లను ఈ కూటమి ప్రభుత్వంలోనైనా కృష్ణా జలా లతో నింపాలని, కృష్ణా జలాలతో చెరువులను నింపితే రైతులు ఏడాదికి మూడు పంటలను సాగు చేసుకుని జీవనం సాగిస్తామని ఆయకట్టుదారులు కోరుతున్నారు. ముఖ్యంగా పెద్దతిప్పసముద్రం మండలంలోని ప్రధాన చెరువులైన కందుకూరు వ్యాసరాయ సముద్రం చెరువు, పెద్దతిప్పసముద్రం తిప్పసముద్రం, రంగసముద్రం రంగరాయ సముద్రం చెరువులకు నీటిని విడుదల చేసి ఆదుకో వాలని రైతులు కోరుతున్నారు.

రంగసముద్రం చెరువుకు హంద్రీనీవా జలాలను మళ్లించండి

- చెన్నకేశవులు, రంగసముద్రం చెరువు సంఘం చైర్మన్



రంగసముద్రం రంగరాయ చెరువును గత పాలకులు విస్మరించడంతో రంగ రాయ చెరువుకు హంద్రీ -నీవా జలాలు కలగానే మిగిలాయి. గత ప్రభు త్వంలో మండలంలోని అన్ని ప్రధాన చెరువులను హంద్రీ-నీవా నీటిని నింపుతామని ప్రగల్భాలు పలికిన పాలకులు రంగసముద్రం చెరువుకు నీటిని మళ్లించనే లేదు. రంగసముద్రం చెరువుకు నీటిని నింపితే సుమారు. 1500 ఎక రాల ఆయకట్టుదారులు పుష్కలంగా పంటలను సాగుచేసుకునేందుకు అవకాశం ఉంటుంది.

అడ్డుకున్నాడని.. పెట్రోల్ పోసి నిప్పుపెట్టారు

● రాయచోటి దుండగుల అరాచకం



పెట్రోల్ పోసిన దాడిలో గాయపడిన యువకుడు

మదనపల్లెఅర్బన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణం బి.కె.పల్లెకు చెందిన ఓ వ్యక్తిపై, జిల్లా కేంద్రం రాయచోటికి చెందిన కొందరు దుండగులు పెట్రోల్ పోసి నిప్పంటించారు. బుధవారం తెల్లవారు జామున జరిగిన ఈ అమానుష ఘటనతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. మంటల్లో కాలుతున్న బాధితున్ని గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం వెంటనే స్థానిక జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ ప్రథమ చికిత్స అనంతరం బాధితున్ని మెరుగైన చికిత్స నిమిత్తం వైద్యులు తిరుపతికి రెఫర్ చేశారు. పోలీసుల కథనం మేరకు..మదనపల్లె పట్టణం, టీకేపల్లెకు చెందిన షేక్ మహబూబ్‌బాషా, షేక్ ఖాసీంసాహెబ్ అన్నదమ్ములు. అయితే ఏడాది కిందట షేక్ మహబూబ్‌బాషా మృతిచెందాడు. షేక్ ఖాసీంసాహెబ్ రాయచోటిలో ఉంటున్నాడు. అయితే అన్నదమ్ముల మధ్య ఆస్తి తగాదాలు ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. ఈ క్రమంలో 15రోజుల కిందట రాయచోటిలోని ఖాసీంసాహెబ్ కుమారులు జావీద్‌బాషా, షామీర్‌బాషా మరికొంతమందితో వచ్చి మహబూబ్‌బాషా కుమారుడు సలీంబాషాతో ఘర్షణ పడ్డారు. తిరిగి బుధవారం తెల్లవారు జామున వచ్చి మరోసారి వివాదానికి ప్రయత్నం చేశారు. అయితే అదే ఇంట్లో అద్దెకు ఉంటున్న రమేష్‌నాయక్‌పై పెట్రోల్ పోసి నిప్పంటించారు. తన బంధువైన షేక్ సలీంబాషాపై దాడి చేయడానికి వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. అయితే ఆయన ఇంటి పైభాగంలో ఉండడంతో అక్కడికి వెళ్లేందుకు గేటు అడ్డుగా ఉంది. ఈ క్రమంలో చుట్టుపక్కల శబ్దాలు చేస్తుండడంతో గమనించిన స్థానికులు అక్కడికి చేరుకుని సర్దిచెప్పే ప్రయత్నం చేసినా వినలేదని సమాచారం. అంతలోనే రమేష్‌నాయక్‌తో పాటు సమీపంలోని మరో వ్యక్తిపై దాడి చేసినట్లు తెలిసింది. సంఘటనా స్థలానికి చేరుకున్న ఓ వ్యక్తి ద్విచక్ర వాహనాన్ని కూడా ధ్వంసం చేసినట్లు చెబుతున్నారు. సలీంబాషా ఇంట్లో రమేష్‌నాయక్(39) బాడుగకు ఉంటూ ఐదేళ్లుగా అక్కడే జిరాక్స్ సెంటర్‌ను నిర్వహిస్తూ జీవిస్తున్నాడు. వీరిని అడ్డుకున్న రమేష్‌నాయక్‌పై కోపోద్రిక్తులైన దుండగులు వెంటతెచ్చుకున్న పెట్రోల్ పోసి నిప్పు పెట్టి పారిపోయారు. మంటలు తాళలేక గట్టిగా అరవడంతో గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు వెంటనే మంటలను ఆర్పి స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. సమాచారం అందుకున్న టూటౌన్ పోలీసులు సంఘటన స్థలం వెళ్లి సంఘటనపై విచారణ చేపట్టారు. ఈ మేరకు టూటౌన్ సీఐ రాజారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇలాంటి సంఘనటలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని బాధితుని కుటుంబ సభ్యులు కోరారు.

ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

రైల్వేకోడూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని కెనరా బ్యాంకు ఆర్సీటీ కో-ఆర్డినేటర్ కె.సుధా కర్‌రెడ్డి తెలిపారు. బుధవారం రైల్వేకోడూరు గిరిజమ్మ వీధిలో టైలరింగ్ శిక్షణ పొందుతున్న మహిళలకు ఉపాధి అవకాశాలపై గ్లోబల్ సర్వీస్ ట్రస్ట్ చైర్మన్ కె.పార్థసారధి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప శివారు లోని కెనరా బ్యాంకు ఆర్సీటీ కేంద్రంలో ప్రతి నెల మహిళలకు టైలరింగ్, జ్యూట్, పెయింటింగ్, యువకులకు ఫొటోగ్రఫీ, డ్రైవింగ్, హౌస్ వైరింగ్ వంటి అంశాలపై ఉచితంగా శిక్షణ ఇస్తున్నారని తెలిపారు. శిక్షణకాలంలో ఉచిత వసతి, భోజన సదుపాయాలు, మెటీరియల్ కూడా ఉచితంగా ఇస్తారని తెలిపారు. ఈ నెల 26 నుంచి మహిళలకు టైలరింగ్, బ్యూటీపార్లర్ మేనేజ్‌మెంట్‌పై నెల రోజుల పాటు ఉచితంగా శిక్షణ ఇస్తారని తెలిపారు. 18 ఏళ్ల వయస్సు నిండిన కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన మహిళలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఉపాధి ద్వారా అభివృద్ధి చెందుటకు ట్రస్ట్ ద్వారా సహకారం అందిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కో-ఆర్డినేటర్ ముస్కీనా, మహి ళలు తదితరులు పాల్గొన్నారు.

వడ్డివారిపల్లెలో ట్రాక్టర్ చోరీ

రామసముద్రం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వడ్డివారిపల్లెలో మంగళవారం రాత్రి రైతు ట్రాక్టర్ చోరీకి గురైంది. గ్రామానికి చెందిన కట్టకింద శ్రీనివాసులు అనే రైతు పొలం పనులు ముగించుకుని యథావిధిగా రాత్రి ఇంటి పక్కనే తన ట్రాక్టర్ ఏపీ39 ఎంకే2633ను నిలిపి నిద్రిస్తున్న సమయంలో చోరీ జరిగినట్లు రైతు శ్రీనివాసులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కలెక్టర్ నిర్ణయించిన ధరలు అమలు చేయాలి

● బొప్పాయి రైతుల వినతి



సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రాజంపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దళారు బొప్పాయి ధరలు తగ్గించి రైతుల పాలిట శాపం గా మారారని ఏపీ రైతుసంఘం, సీఐటీయూ నేతలు, బొప్పాయి రైతులు సబ్‌కలెక్టర్ భావనకు ఫిర్యాదు చేశారు. బుధవారం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట రైతుసంఘం నేతలు నిరసన తెలియజేసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆగస్టు 6న బొప్పాయి రైతులు, దళారులతో చర్చించిన అనం తరం కలెక్టర్ చామకూరి శ్రీధర్ కిలో ధరను రూ.6 నుంచి రూ.10 చెల్లించాలని నిర్ణయించార న్నారు. ఆ ధరలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు సి.రవికుమార్, రాష్ట్ర రైతు సంఘం చిట్వేలి మండలాధ్యక్షుడు ఆదినారాయణ, ఈశ్వరయ్య, వెంకటరమణ, రైతు సంఘ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

బద్వేలు కోర్టు ఏపీపీగా శివరామకృష్ణ నియామకం

కలికిరి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బద్వేలు అదనపు సహాయ సెషన్స్ జడ్జి కోర్టులో ఏపీపీగా న్యాయవాది డి.వి.శివరామకృష్ణను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. మూడేళ్లపాటు ఆయన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కొన సాగనున్నారు. నెలకు రూ.25 వేల గౌరవ వేతనంతో శివరామకృష్ణను నియమిస్తున్నట్లు పేర్కొంటూ హోం శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్ బుధవారం నోటిఫికేషన్ జారీ చేశారు.

పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో గణేశుడి నిమజ్జన ఉత్సవం





పోలీసు కుటుంబాల పిల్లలకు ఆటల పోటీలు ప్రారంభిస్తున్న జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి, జిల్లా పోలీసు కార్యాలయం నుంచి వినాయకుడికి నిమజ్జనానికి తరలిస్తున్న పోలీసు సిబ్బంది

రాయచోటిటౌన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని బుధవారం నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా మహిళా పోలీసులు, జిల్లా పోలీసు కార్యా లయ మహిళా సిబ్బంది ఆటల పోటీలను అదనపు ఎస్పీ ఎం. వెంకటాద్రి జెండా ఊపి ప్రారంభించారు. మ్యూజికల్ చైర్స్, లెమన్ అండ్ స్పూన్ విజేతలకు అదనపు ఎస్పీ ఎం. వెంకటాద్రి, ఏఆర్ డీఎస్పీ ఎం. శ్రీనివాసులు ఇతర ఉన్నతాధికారులు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన వేలంలో లడ్డూను జిల్లా పోలీసు కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ మజ్జారి సునీల్‌కుమార్ రూ.57 వేలకు దక్కించుకున్నారు. అనంతరం కార్యక్రమానికి విచ్చేసిన భక్తులకు అన్న ప్రసాదం అందజేశారు. డప్పుల మోత, నృత్యాలతో ఊరేగింపుగా వినాయకుడి నిమ జ్జనానికి తరలించారు. ఈ వేడుక విజయ వంతానికి సహకరించిన సిబ్బందికి అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి కృతజ్ఞతలు తెలియ జేశారు. విగ్రహ దాత ఏఆర్ పీసీ 427 కే. పరమేశ్‌కు అభినందనలు తెలియజేశారు ఏఆర్ డీఎస్పీ ఎం.శ్రీనివాసులు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ పీ.రాజారమేశ్, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ ఎం.తులసీరాం, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు వీజే రామకృష్ణ, టీ.జాన్‌జోసఫ్, ఎం.పెద్దయ్య, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు పోలీసు సిబ్బంది, పోలీసు కార్యాలయ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు, హోంగార్డులు, పోలీసు కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పీలేరుకు సరిపడా యూరియా సరఫరా

● ఏడీ రమణరావు

పీలేరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): తన పరిధిలోని పీలేరు, కేవీపల్లె మండలాలకు సరిపడా యూరియాలో 90 శాతం ఇప్పటికే సరఫరా చేశామని, పొరుగు మండలాల రైతుల కారణంగా పీలేరులో యూరియా కొరత ఉన్నట్లు వార్తలు వస్తున్నాయని వ్యవసాయ శాఖ ఏడీ రమణరావు పేర్కొన్నారు. పీలేరులో జరుగుతున్న యూరియా పంపిణీ తీరును బుధవారం తనిఖీ చేసిన ఆయన మాట్లాడుతూ పీలేరు, కేవీపల్లె మండలాల్లో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో మామిడి తోటలతో సహా సుమారు 7 వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తున్నారన్నారు. పీలేరు మండలానికి ఖరీఫ్ సీజన్ కోసం 305 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా మండలంలోని 12 రైతు సేవా కేంద్రాల ద్వారా 233 మెట్రిక్ టన్నులు, డీలర్ల ద్వారా మరో 130 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశామన్నారు. మరో 80 మెట్రిక్ టన్నులు రెండు, మూడు రోజుల్లో వస్తున్నాయన్నారు. కేవీపల్లె మండలానికి 309 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా మండలంలోని 12 రైతు సేవా కేంద్రాల ద్వారా 294 మెట్రిక్ టన్నులు, డీలర్ల ద్వారా 20 మెట్రిక్ టన్నులు సరఫరా చేశామన్నారు. మరో 50 మెట్రిక్ టన్నులు వస్తున్నాయన్నారు. పీలేరు, కేవీపల్లె మండలాల రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. వారి అవసరాల మేరకు యూరియా అందుబాటులో ఉందన్నారు. పీలేరు, కేవీపల్లె మండలాలకు పొరుగున్న రొంపిచెర్ల, చిన్నగొట్టిగల్లు, సదుం, పులిచెర్ల, ఎర్రావారిపాళెం మండలాల రైతులు కూడా యూరియా కోసం పీలేరుకు వస్తుండడంతో కొరత ఉన్నట్లు కనిపిస్తోందన్నారు. అయితే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక రైతులకు ప్రథమ ప్రాధాన్యత ఇచ్చి యూరియా అందిస్తున్నామని, దీంతో పొరుగు మండలాల రైతులు నిరాశ పడుతున్నారన్నారు. అవసరమైన మేరకు రైతులు యూరియాను వినియోగించాలని ఆయన ఈ సందర్భంగా రైతులకు సూచించారు.



టోకెన్ల పంపిణీని పరిశీలిస్తున్న అధికారులు

బద్వేలులో యథేచ్ఛగా మట్టి తరలింపు

- బరితెగిస్తున్న మట్టి మాఫియా
- పగలు రాత్రి తేడా లేకుండా మట్టి తరలిస్తున్నవైనం
- చోద్యం చూస్తున్న అధికారులు



గొడుగునూరు చెరువు నుంచి అక్రమంగా మట్టిని తరలిపోతున్న దృశ్యం

బద్వేలు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బద్వేలులో అక్రమ మట్టి తరలింపునకు అడ్డు అదుపు లేకుండా పోతోంది. మట్టికి ఉన్న డిమాండ్‌ను ఆసరాగా చేసుకుని మట్టి మాఫియా బరితెగిస్తోంది. కొండలు, గుట్టలు, చెరువుల్లో సైతం మట్టి తవ్వి యథేచ్ఛగా తరలిస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా చెరువుల నుంచి మట్టిని తవ్వి ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా నూతనంగా నిర్మిస్తున్న ఇళ్ల కోసం తరలిస్తున్నారు. గ్రావెల్ (మట్టి)కు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని మట్టిమాఫియా పగలు, రాత్రి అనే తేడా లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ కార్యాలయాల సెలవు దినాలలో ఈ దందా సాగిస్తున్నారు.

బద్వేలు పట్టణం రోజు రోజుకు విస్తరిస్తున్న తరుణంలో ఇళ్ల నిర్మాణాలకు, అక్రమ లే అవుట్లకు అవసరమైన మట్టికి బాగా గిరాకీ ఉంది. మట్టి తవ్వేందుకు అనుమతులు ఉండి తరలిస్తే పర్వాలేదు. కానీ రాజకీయ పలుకుబడులతో రోజూ బద్వేలు, గోపవరం ప్రాంతాలలో మట్టి మాఫియా అక్రమంగా రోజుకు 200 టన్నుల మట్టిని తరలిస్తోంది. అక్రమ మట్టి తవ్వకాలకు కళ్లెం పడకపోతే ఆ ప్రాంతంలో చెరువులు, వంకలు వాటి స్వరూపాలే పూర్తిగా మారిపోయే దుస్థితి నెల కొంది. ఇదే జరిగితే వర్షపునీరు చెరువుల్లో చేరే పరిస్థితి గానీ, కొద్దో, గొప్పో చెరువుల్లో నీరు చేరినా బయటకు వచ్చే పరిస్థితి గానీ లేదు.

అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు తప్పవు

అనుమతి లేకుండా చెరువులలో మట్టి తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. గొడుగునూరు చెరువు నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లగా వెంటనే మట్టి తవ్వకాలను నిలుపుదల చేస్తామన్నారు.

-వేణుగోపాల్‌రెడ్డి, ఇరిగేషన్ డీఈ, బద్వేలు

రోజుకు 1200 ట్రాక్టర్ల మట్టి తరలింపు

బద్వేలు, గోపవరం ప్రాంతాల నుంచి రోజుకు దాదాపు 1200 ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా మట్టిని తరలిస్తూ లక్షలాది రూపాయలు సంపాదించడమే ధ్యేయంగా పెట్టుకున్నారు. బాకరాపేట చెరువు, శంకరాపురం, సగిలేరుతో పాటు ప్రభుత్వ భూముల నుంచి అక్ర మంగా మట్టిని తరలిస్తున్నారు. కొత్తగా ఇంటి నిర్మాణాలకు, అక్రమ లే అవుట్లకు ఈ మట్టిని తరలిస్తున్నారు. ప్రొక్లైన్లతో పగలు, రాత్రి అనే తేడా లేకుండా తవ్వకాలు జరిపి ట్రాక్టర్లు, టిప్పర్లతో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అయితే వీరికి రాజకీయ నాయకుల అండదండలు ఉండడంతో అధికారులు కూడా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. ఏది ఏమైనా అక్ర మ మట్టి తరలింపునకు అడ్డుకట్ట వేయకపోతే చెరువులు, కుంటలు రూపురేఖలు లేకుండా పోతాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ, ఇరిగేషన్, పోలీసు అధికారులు మట్టి అక్రమ తవ్వకాల తరలింపుపై దృష్టిపెట్టి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

భారీ స్కోర్ దిశగా కడప

- స్వల్ప వెనుకంజలో అనంతపురం



నాగచైతన్య, ప్రమోద్‌కుమార్, ప్రశాంత్

కడప స్పోర్ట్స్, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ సౌత్‌జోన్ అండర్-23 మెన్స్ మల్టీడే ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ పోటీలలో భాగంగా బుధవారం వివిధ జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లలో కడప జట్టు 304 పరుగులతో భారీ స్కోర్ దిశగా సాగుతోంది. మరో మ్యాచ్‌లో అనంతపురం జట్టు స్వల్ప వెనుకంజలో వుంది. వివరాలిలా..... నగర రిమ్స్ సమీప వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో కడప-కర్నూలు జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లో టాస్‌నెగ్గిన కడప జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో మొదటిరోజు ఆట ముగిసే సమయానికి 81 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 304 పరుగులు చేసింది. ఇందులో నాగచైతన్య 53 పరుగులు చేయగా విజయ్‌రామిరెడ్డి 62 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు.

కేఎస్ఆర్ఎం మైదానంలో నెల్లూరు-అనంతపురం జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన నెల్లూరు జట్టు బ్యాటింగ్‌కు దిగి మొదటి ఇన్నింగ్స్‌లో 44.4 ఓవర్లలో 239 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో పవన్‌రిత్విక్ 50 పరుగులు, మాధవ్ 56 పరుగులు చేశారు. బౌలింగ్ విభాగంలో అనంతపురం జట్టు బౌలర్ ప్రమోద్ కుమార్ 5 వికెట్లు పడగొట్టారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 36 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 196 పరుగులు చేసింది. ఇందులో ప్రశాంత్ 90 పరుగులు, అర్జున్ టెండూల్కర్ 52 పరుగులు చేశారు. దీంతో అనంతపురం జట్టు మరో 43 పరగుల స్వల్ప పరుగుల వెనుకంజలో వుంది.

ఫ్లెక్సీ తొలగింపు... ఇద్దరిపై ఫిర్యాదు

బ్రహ్మంగారిమఠం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిరసవంచ గ్రామంలో డిప్యూటీ సీఎం కొణిదెల పవన్‌కళ్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా అదే గ్రామానికి చెందిన జనసేన నేత అన్నలూరు రవి గ్రామంలో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అదే గ్రామానికి చెందిన పాణ్యం రామాజనేయులు, పాణ్యం రవీంద్ర అనే వ్యక్తులు ఫ్లెక్సీలు తొలగించారని బుధవారం బి.మఠం స్టేషన్‌లో ఫిర్యాదు అన్నలూరు రవి ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు. విచారణ చేసి వారిపై కేసు నమోదు చేస్తామని తెలిపారు.

చోరీలకు ప్రయత్నించిన వారిపై బైండోవర్‌కేసు

కలసపాడు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలుచోట్ల చోరీలకు ప్రయత్నించిన ఐదుగురు మహిళలు, ఒక యువకుడిపై బైండోవర్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. చిత్తుకాగితాలు ఏరుకుంటూ మండలంలోని ముద్దంవారిపల్లె, మహానందిపల్లెల్లో ఇళ్లలో ఎవరూలేని సమయంలో చోరీకి పాల్పడుతున్నట్లు తెలిసి వారిని హెడ్‌కానిస్టేబుల్ నాగార్జున, ఎస్‌బి కానిస్టేబుల్ రిజ్వాన్ అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం అనుమానాస్పద వ్యక్తులుగా గుర్తించి వీరిపై బైండోవర్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిమోతి తెలిపారు. వీరిని బుధవారం డిప్యూటీ తహసీల్దార్ మోహన్ రాజు వద్ద హాజరుపరిచారు.

చీటీ డబ్బులు వసూలు చేసి రూ. కోటి 80లక్షలతో మహిళ పరారీ

కడప క్రైం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో ఓ మహిళ చీటీల డబ్బుతో పరారైనట్లు తెలుస్తోంది. ఈమె నాగరాజుపేటలోని రవి థియేటరు సమీపంలో నివాసం ఉంటూ... చుట్టుపక్కల మహి ళలను కలుపుకుని ప్రైవేటు చీటీలు వేసుకుంటూ ఉండేది. గత కొంత కాలంగా చీటీల డబ్బులు దాదాపు రూ.కోటి 80 లక్షలు వసూలు చేసి... వారం రోజుల క్రితం ఇళ్లు ఖాళీ చేసి కుటుంబసభ్యులతో కలసి పరారైనట్లు తెలుస్తుంది. దీంతో బాధితులు బుధవారం కడప వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించారు.

హెడ్‌కానిస్టేబులుపై సస్పెన్షన్ వేటు

- ఎస్ఐకి చార్జ్ మెమో

కడప క్రైం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కడప నగరం టూటౌన్ పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న పరమేశ్ అనే హెడ్‌కాని స్టేబుల్‌ను సస్పెండ్ చేస్తూ పోలీసు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈయనను రైల్వే కొండాపురం స్టేషన్‌కు బదిలీ చేశారు. హెడ్‌కానిస్టేబుల్ అక్కడికి వెళ్లకపోవడంపై ఉన్నతాధికారులు సీరియస్ అయినట్లు తెలుస్తుంది. దీంతో ఆయనపై సస్పెన్షన్ వేటు వేయడంతో పాటు ఎస్ఐకి చార్జి మెమోను అందించినట్లు సమాచారం.

ఉల్లి సాగులో మేలు రకం విత్తనాలు ఎంపిక చేసుకోవాలి

- జిల్లా ఉద్యానశాఖాధికారి రవిచంద్రబాబు



ఉల్లి పంటసాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా ఉద్యానశాఖాధికారి రవిచంద్రబాబు

కాశినాయన, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉల్లి పంటను సాగు చేసే రైతులు మేలు రకం విత్తనాలను ఎంపిక చేసుకోవాలని జిల్లా ఉద్యానశాఖాధికారి రవిచంద్రబాబు పేర్కొన్నారు. బుధవారం సావిశెట్టిపల్లె రైతు సేవా కేంద్రం పరిధిలో సాగుచేసిన ఉల్లి పంటను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్‌లో 14 వేల ఎకరాలలో ఉల్లి పంట సాగు చేస్తున్నారన్నారు. ప్రస్తుతం కేపీ ఉల్లితో పాటు పెద్ద బళ్లారి, చిన్నబళ్లారి రకాలు సాగులో ఉన్నాయని.. పంట ప్రారంభం నుండే రైతులు సంకర రకాలను ఎంచుకొని అధికారుల సూచనలను పాటిస్తూ ముందుకు సాగాలన్నారు. బిందు సేద్య పరికరాలకు ప్రభుత్వం 50 నుంచి 90 శాతం సబ్సిడీ వరకు అందిస్తుందని.. వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతు స్థాయిలో పంట నిల్వచేసుకొనే గోదాములు లేకపోవడం వలన ఉల్లి పంట కోసిన వెంటనే అమ్ముకోవాల్సి వస్తుందని, ఆసమయంలో సరైన ధరలు లేకపోతే రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఉద్యానశాఖ 50 శాతం సబ్సిడీతో ఉల్లి నిల్వ గోదాముల నిర్మాణం కోసం ముందుకు వచ్చిందని.. ఈఅవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి రైతు తాను సాగుచేసిన పంటను తప్పక ఈక్రాప్ బుకింగ్ చేసుకోవాలని, పంట నమోదే అన్ని రకాల సహకారాలకు ప్రామాణికంగా తీసుకోవడం జరుగుతుందని తెలిజేశారు. కార్యక్రమంలో స్థానిక ఉద్యానాధికారి శ్రీనివాసులరెడ్డి, పలువురు సిబ్బంది, రైతుల పాల్గొన్నారు.

ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా కృషి చేయాలి

- పోలీసుల సమీక్షలో జడ్జి బాబాపక్రుద్దీన్



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి బాబాపక్రుద్దీన్

కడప రూరల్, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు ఉమ్మడి కడప జిల్లాలో సెప్టెంబర్ 13న నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌లో పోలీస్‌శాఖ నుంచి అధిక కేసులు రాజీ అయ్యేలా కృషి చేయాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాపక్రుద్దీన్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాసదన్‌లో డీఎస్పీలతో ముందస్తు లోక్ అదాలత్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఎలాంటి ఖర్చు లేకుండా కక్షిదారులకు సత్వర న్యాయసేవలందించే లక్ష్యంతో సుప్రీం కోర్టు 1987లో న్యాయసేవాధికార సంస్థల చట్టాన్ని రూపొందించిందన్నారు. ఇలాంటి ప్రాముఖ్యత కలిగిన లోక్ అదాలత్ ను సెప్టెంబర్ 13న ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా నిర్వహించడం జరుగుతోందన్నారు. ఈ మేరకు జిల్లా పోలీస్‌శాఖ నుంచి అత్యధిక కేసులు రాజీ అయ్యేలా తగు చర్యలు చేపట్టాలన్నారు. గత లోక్ అదాలత్ కంటే ఈసారి ఎక్కువ కేసులు పరిష్కరించేలా సహకరించాలన్నారు. లోక్‌అదాలత్ ప్రాముఖ్యతను కక్షిదారులకు వివరించాలన్నారు. వ్యక్తుల మధ్య తగాదాలను రాజీమార్గం ద్వారా పరిష్కరించడానికి పోలీసుల తోడ్పాటు చాలా అవసరమన్నారు. కక్షిదారులు లోక్ అదాలత్‌లో రాజీపడేలా అవగాహన కల్పించాలన్నారు. లోక్ అదాలత్‌లో పరిష్కారం అయ్యే కేసులకు ఎటువంటి ఖర్చు ఉండదన్నారు. సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. ఇక్కడ పరిష్కారం అయిన కేసు సుప్రీం కోర్టు తీర్పుతో సమానమైందన్నారు. తిరిగి అప్పీల్‌కు వెళ్లడానికి వీలుపడదన్నారు. లోక్ అదాలత్ పరిధిలోకి రాని కేసులంటూ ఏవీ లేవ న్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ల వారీగా కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో రాజంపేట అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ యనోజ్ హెగ్డే, కడప, మైదుకూ రు, ప్రొద్దుటూరు, రాయచోటి సబ్ డివిజనల్ పోలీసు అధికారులు ఏ.వెంకటేశ్వర్లు, జి.రాజేంద్రప్రసాద్, పి.భావన, ఆర్.కృష్ణమోహన్, కడప కోర్టు మానిటరింగ్ సెల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

7న గండి ఆలయం మూసివేత

చక్రాయపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో వీరాంజనేయస్వామి ఆలయాన్ని ఈనెల 7వ తేదీ చంద్రగ్రహణం కారణంగా మూసివేయడం జరుగుతుందని ఆలయ సహాయ కమిషనర్ జె.వెంకటసుబ్బయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 7వ తేదీ సాయంత్రం 4గంటల నుంచి ఆలయం మూసివేసి తిరిగి 8వ తేదీ సోమవారం తెల్లవారు జామున సంప్రోక్షణ చేసి ఉదయం 5గంటల నుంచి ఆలయాన్ని తెరిచి.. సుప్రభాతం, పుణ్యాహవాచనం, ఆలయశుద్ధి, స్వామివారికి పంచామృత అభిషేకం, ఆరాధన, నివేదిన అనంతరం ఉదయం 7గంటల నుంచి స్వామివారి సర్వదర్శనం ప్రారంభం అవుతుందన్నారు.

ప్రొద్దుటూరులో శివాలయంలో...

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయాన్ని ఈనెల 7వ తేదీ సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా మూసివేస్తున్నట్లు దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్, ఆలయ ఈవో వెంకటసుబ్బయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం రాత్రి 9.50 గంటలకు చంద్రగ్రహణం ప్రారంభం అవుతుందని, సోమవారం తెల్లవారుజామున 3.41 గంటలకు గ్రహణం విడుస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటలకు స్వామివారికి మహానైవేద్యం సమర్పించి ఆలయాన్ని మూసివేస్తామని, సోమవారం ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, పుణ్యా ఆవాచనం, సంప్రోక్షణ తర్వాత భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు.

భక్తిశ్రద్ధలతో వేంకటేశ్వరస్వామికి పూజలు



ఆలయంలో శాస్త్రోక్తంగా పవిత్ర పూజలు

జమ్మలమడుగు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు నారాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ఆలయ పండితులు, అధికారులు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. పవిత్ర సమర్పణ కార్యక్రమాల్లో భాగంగా ఉదయం స్వామివారిని సుప్రభాత పూజతో ప్రారంభించి యాగశాలలో పుణ్యాహవాచనం, కుంభ ఆరాధన, తదితర పూజలు, హోమాలు చేశారు. అనంతరం యాగశాలలో పవిత్ర మాలలకు ఉపచారాలు నిర్వహించి ప్రదక్షిణగా స్వామివారి సన్నిధికి చేర్చారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో ప్రశాంతి, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

'పగటి కలగా మారిన పది పరీక్షల పారితోషికం'

కడప ఎడ్యుకేషన్,సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల మూల్యాంకన విధులకు సంబంధించిన పారితోషికం పగటి కలలాగా మారిపోయిందని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు తెలిపారు. బుధవారం కడప జిల్లా విద్యాశాఖాధికారి షేక్ షంషుద్దీన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. జిల్లా కార్యదర్శి ఏజాస్ అహమ్మద్, నాయకులు గాజులపల్లె గోపీనాథ్, బత్తుల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారమే భోజనం

- సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టరు

కడప ఎన్జీఆర్‌సర్కిల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మెనూ ప్రకారమే విద్యార్థులకు హాస్టళ్లలో భోజన వసతి కల్పిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టరు కె.సరస్వతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

'మెనూ అలా .. ధరలు ఇలా .. అమలు ఎలా' అనే శీర్షికతో గత నెల 29న ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనానికి ఆమె స్పందించారు. జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులకు ప్రభుత్వ నిర్దేశిత మెనూ ప్రకారం భోజన వస తి కల్పించడం జరుగుతుందని వివరించారు. అదేవిధంగా సహా య సాంఘిక సంక్షేమ అధికారుల ద్వారా విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

పులివెందుల కళాశాలలో సమస్యలు పరిష్కరించండి

- జేఎన్‌టీయూఏ వీసీకి మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి వినతి



జేఎన్‌టీయూఏ వీసీకి వినతి పత్రం ఇస్తున్న బీటెక్ రవి

అనంతపురంరూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూఏ అనుబంధమైన పులివెందుల ఇంజనీరింగ్ కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి కోరారు. ఆ మేరకు ఆయన అనంతపురంలోని జేఎన్‌టీయూఏ వీసీ సుదర్శన్‌రావును బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. కళాశాలలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి కార్యక్రమాలు, పనుల గురించి చర్చించారు. రాబోయే కాలంలో యూనివర్శిటీ సర్వతోముఖాభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు పూర్తిగా ఉంటాయని పేర్కొన్నారు.

లింగ నిర్ధారణపై విచారణ

- కర్నూలుకు గర్భిణుల తరలింపు
- ప్రొద్దుటూరులో ఏజెంట్ల దందా వాస్తవమే
- వివరాలు వెల్లడించిన డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ గీత



స్టాఫ్ నర్సు రూతుని విచారిస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో గీత

ప్రొద్దుటూరు రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎన్నో హెచ్చరికలు.. తనిఖీలు.. డయాగ్నోస్టిక్ సెంటర్లు, నర్సింగ్‌హోంల నిర్వహణపై నిఘా.. దళారీ వ్యవస్థపై డెకాయి ఆపరేషన్... ఇలా ఎన్ని చర్యలు చేపట్టినా లింగ నిర్ధారణ వెల్లడి దందా ఆగడంలేదు. ఈ వ్యవహారంపై జూలై 20వ తేదీ 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో 'లోకం చూడకనే... అనంత లోకాలకు...!' అనే కథనం ప్రచురితం అయింది. బహిరంగంగా సాగుతున్న ఈ బ్రోకర్ల దందా వ్యవహారంపై వైద్యాధికారులు తనిఖీలు చేసి వీటిని అరికట్టేందుకు డెకాయి ఆపరేషన్ కొనసాగిస్తామని వెల్లడించారు. ఈ వ్యవహారంలో అందిన ఫిర్యాదుల మేరకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారుల ఆదేశాలతో బుధవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ గీత ప్రొద్దుటూరులో దర్యాప్తు చేపట్టారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానికంగా లింగ నిర్ధారణ కట్టడి అయిందని, అయితే కొంతమంది దళారులు గర్భిణులను ఇక్కడి నుంచి కర్నూలుకు తరలిస్తున్నారనే విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. రూ.15వేలకు లింగ నిర్ధారణను దళారులు చేయిస్తున్నారని నిర్ధారణ అయినట్లు చెప్పారు. ప్రొద్దుటూరుకు చెందిన ఓ మహిళకు ఇది వరకే ముగ్గురు ఆడపిల్లల సంతానం. తన నాలుగవ కాన్పులో అయినా మగబిడ్డ కావాలనే ఉద్దేశ్యంతో లింగనిర్ధారణ వెల్లడి కోసం బద్వేలుకు చెందిన లత అనే ఏజెంట్ ద్వారా ప్రొద్దుటూరులోని స్టాఫ్ నర్సు రూతుని సంప్రదించారని చెప్పారు. జమ్మలమడుగు రోడ్డులోని ఓ ప్రైవేటు నర్సింగ్‌హోంలో పనిచేస్తున్న రూతు ఆ గర్భిణిని కర్నూలులోని ప్రసాద్ అనే ఏజెంట్ వద్దకు పంపారన్నారు. అతను ఓ ప్రైవేటు ఆస్పత్రిలోకి తీసుకెళ్లి స్కానింగ్ చేయించారన్నారు. అయితే ఆమె గర్భం దాల్చి కేవలం ఆరు వారాలు మాత్రమే కావడంతో లింగ నిర్ధారణ వెల్లడి కష్టమని.. మరో నెల తర్వాత లింగ నిర్ధారణ చేస్తామని కొంత మొత్తం డబ్బులను వసూలు చేసుకుని తిరిగి పంపించారన్నారు. అయితే ప్రొద్దుటూరుకు వచ్చిన ఆ గర్భిణికి అబార్షన్ అయిందన్నారు. ఆర్థికంగా వారు పేదవారు కావడంతో రూ.15 వేల కోసం రూతును నిలదీశారు. ఈ నేపధ్యంలో అందిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేయగా ఇక్కడి ప్రైవేటు ఆస్పత్రికి ఎలాంటి సంబంధాలు లేవని చెప్పారు. అయితే ఏజెంట్ల ప్రమేయం నిర్ధారణ అయినట్లు డాక్టర్ గీత వెల్లడించారు.

ఏజెంట్లకోసం గాలింపు

ప్రొద్దుటూరు కేంద్రంగా సాగుతున్న లింగ నిర్ధారణ వెల్లడిలో కీలకపాత్ర పోషిస్తున్న నర్సులు, వైద్యరంగంలో ప్రమేయం ఉన్న మహిళలు ఏజెంట్ల అవతారం ఎత్తిన వ్యక్తుల గుట్టు రట్టు చేసేందుకు క్షేత్రస్థాయిలో దర్యాప్తు చేపట్టామని వైద్యాధికారులు చెప్పారు. స్థానిక నర్సు రూతు, కర్నూలుకు చెందిన ఏజెంటు ప్రసాదు వివరాలను జిల్లా వైద్యాధికారుల దృష్టికి తీసుకెళ్లగా వారు కర్నూలు జిల్లా డీఎంఅండ్‌హెచ్‌వోను అప్రమత్తం చేశారన్నారు. రెండు జిల్లాలకు చెందిన వైద్యాధికారులు ఏజెంట్లను పట్టుకునే చర్యలను చేపట్టినట్లు వివరించారు. చాపకింద నీరులా సాగుతున్న ఈ దందాపై స్పష్టమైన ఆధారాలతో తమకు సమాచారం ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె కోరారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచండి



పనులు పరిశీలిస్తున్న ఏపీఓ

పెద్దమండ్యం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీఓ శ్రీధర్‌రావు, ఏపీఓ సురేంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఉదయం కోటకాడపల్లిలో జరుగున్న ఉపాధి పనులను తనిఖీ అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో పనులపై సమీక్షించిన ఆయన మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు తక్కువ కావడంతో వ్యవసాయ పనులు లేని ప్రభావంతో మండలంలో ప్రతి కూలీకి పనులు కల్పించాలన్నారు. ఎస్టీ, ఎస్సీ కుటుంబాలకు వందశాతం ఉపాధి పనులు కల్పించాలన్నారు. ఉపాధి పనుల్లో రోజు వారీ కూలీ రూ. 300 గిట్టుబాటు అవుతున్నట్లు తెలిపారు. రైతులకు ప్రయోజనకర పనులు చేపట్టాలని ఆదేశించారు. పండ్ల తోటలు మంజూరైన రైతులు మొక్కలు నాటుకోవాలన్నారు. పండ్ల తోటలు పెంచుకునే ఆసక్తి గల రైతులు దరఖాస్తు కోసం ఫీల్డ్ అసిస్టెంట్లను సంప్రదించాలన్నారు. సకాలంలో బిల్లుల చెల్లింపులు జరుగుతాయన్నారు రైతులు, కూలీలకు అవగాహన కల్పించాలన్నారు. జాబ్‌కార్డు వున్న కూలీలకు ఆయా ప్రాంతాల్లోనే పనులు కల్పిస్తామన్నారు. పనులు చేసే ప్రతి ఉపాధి కూలీ ఫోన్ నెంబర్, ఆధార్ లింక్ చేసుకుని జాబ్‌కార్డుకు ఈకేవైసీ అనుసంధానం కలిగి వుండాలన్నారు. లేని పక్షంలో అకౌంట్‌లలో కూలీ డబ్బు జమ కావడం జాప్యం జరుగుతుందన్నారు. రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కల సంరక్షణ ఉపాధి సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలన్నారు. పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి



సబ్‌కలెక్టర్ కళ్యాణికి వినతి పత్రం ఇస్తున్న బీవైఎస్ నేతలు

మదనపల్లె టౌన్, సెప్టెంబరు3(ఆంధ్ర జ్యోతి): రూ.కోట్ల విలువైన పంచాయతీ స్థలాన్ని కాపాడలేని అధికారులపై చర్యలు తీసుకోవాలని బీవైఎస్ అధ్యక్షుడు పునీత్ విన్నవించారు. బుధవారం సబ్‌కలెక్టరేట్‌లో సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణిని బీవైఎస్ నేతలు కలసి వినతి పత్రం ఇచ్చారు. తట్టివారిపల్లె పంచాయతీ దేవతానగర్‌లో 30 ఏళ్ల కిందట వేసిన లేఅవుట్‌కు నిబంధనల ప్రకారం 10 కుంటల స్థలాన్ని పంచాయతీకి రాసిచ్చారన్నారు. ఈ స్థలం విషయమై 11 ఏళ్లుగా కోర్టులో కేసు నడుస్తుండగా, పంచాయతీ అధికారులు నిర్లక్ష్య ధోరణితో కోర్టు కేసు విషయమై సరైన పత్రాలు చూపకపోవడంతో ఈ కేసు ఎగస్పార్టీ అయినట్లు తెలిసిందన్నారు. ఈ స్థలం విషయమై పంచాయతీ అధికారులు హైకోర్టుకు వెళ్లి విలువైన స్థలాన్ని కాపాడేలా చర్యలు తీసుకోవాలని సబ్‌కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో బీవైఎస్ నేతలు హరికృష్ణ, జిలాని, శ్రీనివాసులు, శశికుమార్, వినయ్ పాల్గొన్నారు.

'పారిశుధ్య కార్మికుల సంఖ్యను పెంచాలి'



నిరసన తెలుపుతున్న మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పారిశుధ్య కార్మికుల సంఖ్యను పెంచాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ ముబారక్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసనలో వారు మాట్లాడుతూ మున్సిపాలిటీలో రోజురోజుకూ పెరుగుతున్న జనాభాకు అదనంగా పారిశుధ్య కార్మికులను పెంచాలని కోరారు. కార్మికులు తక్కువగా ఉండడంతో చెత్త సక్రమంగా తొలగించక పారిశుధ్య లోపం స్పష్టంగా కన్పిస్తోందన్నారు. దీంతో ప్రజలు ఆరోగ్యం, పరిశుభ్రత దెబ్బతింటుందన్నారు. మున్సిపాలిటీలో ఉన్న 35 వార్డులకు ప్రతి వార్డుకు 15 మంది పారిశుధ్య కార్మికులు తప్పక ఉండాలన్నారు. ఈ విషయమై ఆందోళనలు చేపట్టినా ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్, చలపతినాయుడు ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి తిరుమల, సహాయ కార్యదర్శి దేవా, నాగరాజు, లక్ష్మీదేవి, దుర్గమ్మ, సుజాత, సుగుణ, భారతలమ్మ పాల్గొన్నారు.

బోధనేతర కార్యక్రమాల నుంచి విముక్తి కల్పించాలి

ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి మహేశ్వర్ రెడ్డి



సభ్యత్వ నమోదులో పాల్గొన్న యూనియన్ నేతలు, ఉపాధ్యాయులు

పీలేరు రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాల నుంచి విముక్తి కల్పించాలని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి గుర్రం మహేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర కన్వీనర్ లోకనాథరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలో ఎస్టీయూ సభ్యత్వ నమోదు సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యార్థులకు పాఠాలు బోధించాల్సిన ఉపాధ్యాయులను యాప్‌లు, ఆన్‌లైన్ పనులు, శిక్షణ తరగతులు అంటూ ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. కొత్తగా ప్రవేశ పెట్టిన మూల్యాంకన పత్రాలు ఉపాధ్యాయులకు అగ్ని పరీక్షగా మారాయన్నారు. వెంటనే పీఆర్‌సీ ప్రకటించాలని, మధ్యంతర భృతి మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర బైలా కమిటీ కన్వీనర్ జగన్‌మోహన్ రెడ్డి, ప్రచార కమిటీ కన్వీ నర్ డాక్టర్ జనార్ధన్ రెడ్డి, జిల్లా ఆర్థిక కార్యదర్శి అరవ వేణుగోపాల్ రెడ్డి, మండల అధ్యక్ష, కార్యదర్శులు భాస్కర్ రెడ్డి, వెంకట్రమణ, జయరాం నాయక్, సురేంద్రనాథ రెడ్డి పాల్గొన్నారు.

అధ్యాపకుడిని విధుల నుంచి తొలగించాలి



కాలేజీయేట్ స్పెషల్ కమిటీకి ఫిర్యాదు చేస్తున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా జనరల్ సెక్రటరీ మాధవ్‌కుమార్

వాల్మీకిపురం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినుల పట్ల లైంగిక వేధింపులకు పాల్పడిన అధ్యాపకుడిని తక్షణం విధుల నుంచి తొలగించాలని ఏఐఎస్ఎఫ్ అన్నమయ్య జిల్లా కార్యదర్శి మాధవ్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కళాశాల వద్ద ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలో ఆయన మాట్లాడుతూ 8ఏళ్లుగా కామర్స్ అధ్యాపకుడిగా పనిచేసిన జీఎం.సుదర్శన్ విద్యార్థినులను అసభ్యకరంగా మాట్లాడి వేధించడం తనకు నచ్చినట్లుగా ఉండకపోతే ఇంటర్నల్ మార్కులు తగ్గిస్తానని బెదిరించి లొంగతీసుకునే ప్రయత్నాలు కూడా చేశాడని ఆరోపించారు. దీనిపై పత్రికల్లో కథనాలు రావడంతో ఏపీ కమిషనర్ ఆఫ్ కాలేజీయేట్ డైరెక్టర్ డాక్టర్ భరత్ నారాయణగుప్త స్పందించి అధ్యాపకుడిని సస్పెండ్ చేశారన్నారు. ఈ విషయమై బుధవారం కళాశాలకు వచ్చిన స్పెషల్ కమిటీ సభ్యులకు వినతిపత్రం అందజేస్తూ తక్షణం అధ్యాపకుడు సుదర్శన్‌ను విధుల నుంచి తొలగించాలని విచారణ కూడా సమగ్రంగా చేపట్టి చర్యలు తీసుకోని పక్షంలో తిరిగి నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి రెడ్డికృష్ణ, నేతలు గోవర్ధన్, సాయి, బాలాజీ, భవానిప్రసాద్, రాహుల్‌తేజ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆటోలు భద్రమేనా ?



విద్యార్థినులకు తప్పని తిప్పలు ● ప్రమాదాలు జరిగినా పట్టించుకోరా
పరిమితికి మించి కుక్కేస్తున్న ఆటోవాలాలు ● రికార్డులు లేని ఆటోలతోనే ప్రమాదం

గుర్రంకొండ, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఇంటి వద్ద ఎక్కి తిరిగి ఇంటి వద్దే దిగుతారనే విధానంతో అనేక మంది పిల్లలను పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు ఆటోలనే వినియోగిస్తుంటారు. అయితే పరిమితికి మించి ఆటోలో ప్రయాణీకులను తరలిస్తున్నారు. కొందరు పాఠశాల విద్యార్థులను స్కూల్ వద్దకు చేర్చే క్రమంలో తెలియని వయస్సులో విద్యార్థినులను ప్రేమ పేరుతో పక్కదారి పట్టించి ఇబ్బందులు పెడుతున్నారు. తల్లి దండ్రులకు విషయం తెలిసేలోపే బాలికల బంగారు భవిష్యత్‌ను బుగ్గిపాలు చేస్తున్నారు. మరి కొందరు ఆటో డ్రైవర్లు మద్యం మత్తులో ఆటోలను నడుపుతూ ప్రమాదాలకు గురి చేసి విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నారు. ఆటో డ్రైవర్ల ఆగడాలు మితిమీరిపోతున్నా పట్టించుకునే వారు లేకపోవడం బాధాకరమని తల్లిదండ్రులు వాపోతున్నారు. మారుమూల పల్లెలు, గ్రామీణ ప్రాంతాలకు రోడ్లున్నా బస్సులు తిరగడంలేదు. కొన్ని మార్గాల్లో అరకొరగా బస్సులు నడుస్తున్నా నిర్దిష్ట సమయం లేకపోవడంతో గ్రామీణ విద్యార్థులు, ప్రజలు ప్రయాణాలు చేయడం కష్టతరంగా మారింది. బస్సులు తిరగని రోడ్లల్లో ఆటోలు, జీపులు తిరుగుతుండడం, పరిమితికి మించి ప్రయాణీకులతో వెళ్లడం ప్రమాద సంకేతమే. వివరాల్లోకెళితే...

పట్టణంలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కాలేజీలకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల విద్యార్థినులు గుర్రంకొండకు వస్తారు. ఈ క్రమంలో కొన్ని రోడ్లలో బస్సు సౌకర్యం లేదు. దీంతో విద్యార్థినులు ఆటోలపై ఆధారపడి పాఠశాలలు, కాలేజీలకు వస్తున్నారు. ఇదే అదునుగా భావించిన కొందరు ఆటో డ్రైవర్లు పాఠశాల విద్యార్థులను స్కూల్ వద్దకు చేరుస్తున్నారు. ఈ నెపంతో బాలికలకు మాయ మాటలు చెప్పి పక్కదారి పట్టిస్తున్నారు. ఇటీవల గుర్రంకొండ పాఠశాలకు వచ్చి చదువుకునే ఇద్దరు బాలికలను ప్రేమ పేరుతో ఆటో డ్రైవర్లు తీసుకెళ్లడంతో తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. దీంతో ఆటో డ్రైవర్లు బాలికలను తిరిగి తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. ఆటోలను నడిపేవారికి లైసెన్సులు లేక పోవడం, మైనర్లు నడుపుతుండడంతో ఎప్పుడు ప్రమాదాలు జరుగుతాయోనని తెలియని పరిస్థితి నెలకొంది. విద్యార్థులను తరలించే ఆటోలో 15 నుంచి 20 మందికి పైగా బాలబాలికలను కుక్కేస్తున్నారు.



ఆటో ఏ చిన్న ప్రమాదానికి గురైనా అందులోని విద్యార్థుల పరిస్థితి ఊహించడం వర్ణాతీతం. రెండు నెలల కిందట సరిమడుగు, సంగసముద్రం, తరిగొండ మార్గాల్లో విద్యార్థులను తరలిస్తున్న ఆటోలు అతివేగం, అదుపుతప్పి బోల్తాపడిన సంఘటనలో చాలా మంది విద్యార్థులు గాయాలబారిన పడ్డారు. పరిమితికి మించి విద్యార్థులు, ప్రయాణీకులను తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

పరిమితికి మించి తరలించరాదు

గ్రామాలు, పట్టణంలో తిరిగే ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి. ఆటోలో పరిమితికి మించి ప్రయాణీకులు, విద్యార్థులను తరలించరాదు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించే ఆటో డ్రైవర్లపై చర్యలు తీసుకుంటాం. మద్యం సేవించి ఆటోలు నడిపే వారిపై కేసు నమోదు చేస్తాం.

రఘురాం, ఎస్ఐ, గుర్రంకొండ

అక్రమాలు నామమాత్రమే

ఉపాధిహామీ పనుల తనిఖీ ● పక్కదారిపట్టిన రూ. 1.30 లక్షల రికవరీ
ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్ల సస్పెన్షన్ ● డ్వామా పీడీ వెంకటరత్నం



సామాజిక తనిఖీ సభలో మాట్లాడుతున్న పీడీ వెంకటరత్నం

బి.కొత్తకోట, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలంలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో అక్రమాలు నామమాత్రమేనని, చేపట్టిన పనులు, వాటికోసం వినియోగించిన నిధులు దాదాపుగా సరిపోయాయని డ్వామా పీడీ వెంకటరత్నం పేర్కొన్నారు. ఈపనుల కోసం రూ. 5.69 కోట్ల నిధులు వెచ్చించారు. మండలంలో 1 ఏప్రిల్ 2024 నుంచి 31మార్చి 2025 వరకు జరిగిన 1226 పనులపై సామాజిక తనిఖీపై బుధవారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో బహిరంగ సభ నిర్వహించారు. కూలీల చెల్లింపులు, మెటీరియల్ ఖర్చులు ఉన్నాయి. ఈ పనులపై క్షేత్రస్థాయిలో స్టేట్‌రిసోర్స్ పర్సన్లు, డీఆర్పీలు కలిసి 18 నుంచి 26 వరకు విచారణ చేసి నివేదిక సిద్ధం చేశారు. ఈ నివేదికపై జరిగిన బహిరంగసభలో గ్రామాల వారీ 15 గ్రామాల వివరాలను సామాజిక తనిఖీ బృందం వివరించింది. వివిధ రకాల పనుల్లో బృందం గుర్తించిన అక్రమాలపై అప్పటి కప్పుడు చర్యలు తీసుకున్నారు. ఉపాధి పనుల్లో పక్కదారిపట్టినట్టు బహిర్గతమైన రూ.1,01,888, పంచాయతీరాజ్ శాఖకు చెందిన రూ.28,958ను రికవరీ చేశారు. విధి నిర్వహణలో అలసత్వం వహించిన మొటుకు క్షేత్ర సహాయకులు క్రిష్ణకుమార్, నరసింహులును విధులనుంచి సస్పెండ్ చేసినట్టు పీడీ ప్రకటించారు. మరో ఇద్దరు టెక్నికల్ అసిస్టెంట్లు మణికంఠ, నారాయణకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పీడీ వెంకటరత్నం మాట్లాడుతూ ఉపాధిహామీ పనుల ద్వారా కేంద్ర ప్రభుత్వం రైతు కూలీలను ఆదుకుం టోందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్క రూ వినియోగించుకోవాలన్నారు. సిబ్బంది పారదర్శకంగా పనిచేయాలని ఏమాత్రం అక్రమాలకు పాల్పడినా, అలసత్వం వహించినా చర్యలు తప్పవన్నారు. ఏపీడీ నంద కుమార్, ఎస్టీఎం లోకేశ్వర్‌రెడ్డి, ఎస్ఆర్పీ తిరుమలేష్, ఎంపీపీ లక్ష్మీనరసమ్మ, ఎంపీడీఓ క్రిష్ణవేణి, ఏపీఓలు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

అఖండ దీపం కానుక



వాల్మీకిపురం శివాలయానికి అఖండ దీపం అందజేస్తున్న దాతలు

వాల్మీకిపురం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక కోనేటివీధిలో వెలసిన లక్ష్మీకామేశ్వరస్వామి ఆలయానికి దాతలు అఖండ దీపం బహూకరించారు. పట్టణానికి చెందిన ఫణికుమార్ దంపతులు తమవంతు సాయంగా అఖండ దీపం అందజేశారు. ఆలయంలో విశేష పూజలు, అఖండ దీపారాధన, భక్తులకు తీర్థప్రసాదాల పంపిణీ జరిగాయి. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కువైట్ శంకరాచారి, అర్చకులు గోనవరపు శీనాస్వామి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కలిచెర్లలో నేడు
ఉచిత కంటి వైద్య శిబిరం

పెద్దమండ్యం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి) కలిచెర్ల తెలుగు హైస్కూల్‌లో గురువారం హెల్పింగ్ మైండ్స్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం జరుగనున్నట్లు హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకులు అబూబకర్ సిద్దిక్ వెల్లడించారు. మదనపల్లె ఇషి కంటి ఆస్పత్రి కంటి వైద్య నిపుణులచే హైస్కూల్‌లో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు జరుగనున్న వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సాంకేతిక పరిజ్ఞానం ముఖ్యం

కలకడ, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం కలిగి ఉండడం చాలా ముఖ్యమని ఏఓ శ్రీనివాస్ అన్నారు. వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) ఆధ్వర్యంలో బుధవారం ముడియం వారిపల్లెలో జరిగిన శిక్షణలో నానో డీఏపీ, కిసాన్ డ్రోన్ వాడకం ఉపయోగాలపై అవగాహన కల్పించారు. ఏఓ మాట్లాడుతూ బస్తా యూరియాకు ప్రత్యామ్నాయంగా సమాన ప్రయోజనాలు అందించే అర లీటర్ నానో యూరియాను పంటకు పిచికారీ చేయించుకోవాలని సూచించారు. ఆత్మ పీడీ అమృత్ కుమార్‌రెడ్డి రైతుల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న శిక్షణలు, పొలాల్లో క్షేత్ర దినాలు, శాస్త్రవేత్తలతో చర్చావేదికలు, అంతరాష్ట్ర విజ్ఞాన వేదికలు వంటి కార్యక్రమాలు గురించి తెలియజేశారు. కార్యక్రమంలో సిబ్బంది త్రిశూల్, గ్రామస్థులు పాల్గొన్నారు.

భారీగా అన్నదానం

వాల్మీకిపురం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా బుధవారం గణేశ్ ప్రతిమల వద్ద విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ కాలనీ, కొత్త ఇందిరమ్మకాలనీ, బజారు వీధి, తదితర ప్రాంతాల్లో భక్తులకు అన్న ప్రసాద వితరణ చేపట్టారు. మండపాల చెంత వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, చిన్నారుల నృత్య ప్రదర్శనలు ప్రత్యేకార్షణగా నిలిశాయి. ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు, యువత పాల్గొన్నారు.

నిలిచిన బైక్‌ను ఢీ కొన్న కారు
ఇద్దరికి తీవ్రగాయాలు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 3: నిలిచిన బైక్‌ను కారు ఢీ కొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రి అవుట్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు బసినికొండ బైపాస్ రోడ్డులో బుధవారం రాత్రి ప్రమాదం జరిగింది. మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ తట్టి శ్రీనివాసులురెడ్డి కారు తన డ్రైవర్ పుంగనూరుకు వెళుతుండగా బసినికొండ బైపాస్ రోడ్డులో నిలిపి ఉన్న టూ వీలర్‌ను ఢీ కొని తరువాత రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్థంభాన్ని ఢీ కొని కారు నిలిచింది. ఈ ప్రమాదంలో కొత్తయిండ్లకు చెందిన ఎల్లప్ప కుమారుడు బేల్దార్ మేస్త్రీ గోపాల్, నిమ్మనపల్లె మండలం, ఎగువమాచిరెడ్డి గారిపల్లెకు చెందిన రామన్న కుమారుడు శంకరకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108లో క్షతగాత్రులను వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు తాలుకా సీఐ కళా వెంకటరమణ ప్రమాద స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

రోడ్లు గుంతలమయం

ఇబ్బందుల్లో వాహనచోదకులు
పట్టించుకోని అధికారులు



ప్రశాంత్ నగర్‌లో పాఠశాల సమయంలో వాహనాల రద్దీ

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ముందే ఒకింత చెడిపోయిన రోడ్లు, దీనికి తోడు ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలు మరింత పెద్దవయ్యాయి. ఫలితంగా వాహన చోదకులు అటు వెళ్లడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారు. చెవి పిండి మరీ పన్నులు వసూలు చేస్తున్న మున్సిపల్ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. పట్టణంలో జనాభా సంచరించే ప్రాంతాలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేట్ స్కూల్స్ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రజలు, వాహనదారుల ఇక్కట్లు చెప్పలేకున్నాయి. తప్పని పరిస్థితుల్లో ద్విచక్రవాహనాల్లో ఇద్దరు, ముగ్గురు విద్యార్థులు, బ్యాగ్‌లు తలించుకుని వాహనాల్లో వెళుతుండడం ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్కూల్‌కు, కళాశాలలకు సమయం దాటుతుండంతో ఉదయాన్నే 9 గంటలకు రోడ్లపై వాహనాలతో రద్దీ ఎక్కువగా ఉంటుంది. స్కూల్, కళాశాల వ్యాన్లు గంతల రోడ్లపైకి రావడంతో ట్రాఫిక్ సమస్య మొదలవుతోంది. ద్విచక్రవాహనాలు సైడ్‌కు పోలేక, గుంతల్లో దింపలేక సమస్యను ఎదుర్కొంటున్నారు. అదుపు తప్పి విద్యార్థులతో వెళుతున్న వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. వర్షం కురిస్తే ఇక చెప్పనక్కరలేదు, పక్కన వెళుతున్న వాహనాలు గుంతల్లోకి దిగడంతో బురద నీళ్లు విద్యార్థులపై పడి పాడుచేస్తున్నాయి. దీంతో పిల్లలు ఇంటికి వెళ్లి మరీ రెండో పర్యాయం ఉతికిన దుస్తులు వేసుకుని వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద, పుంగనూరు రోడ్డు నెమలి కళ్యాణ మండపం సమీపంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో ఎక్కువగా గుంతలున్నాయి. ఈ ఏరియాలో వేలమంది ప్రజలు, విద్యార్థులు వెళుతుంటారు. సమస్యలున్నా మున్సిపల్ అధికారులు చొరవ చూపడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.





ఎస్బీఐ కాలనీ వద్ద గుంతలమైయమైన రోడ్డు - జ్ఞానోదయ స్కూల్ వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంతలు

రైతులు ఆధునిక పద్ధతులు పాటించాలి

నిమ్మనపల్లి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు పాటించాలని ఏఓ మంజుల పేర్కొన్నారు. బుధవారం అగ్రహారం పంచాయతీలో పొలంపిలుస్తోందిలో ఆమె మాట్లాడుతూ వేరుశనగ రైతులు దుక్కి సమయంలో లోతుగా దున్నితే రెండు రోజులు భూమి ఎండకు ఆరితే చీడపురుగులు దరిచేరవన్నారు. వరి వేసే రైతులు సాలుకు నాటితే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. అనంతరం అగ్రహారం, సామకోటవారిపల్లి పంచాయతీల రైతులకు ప్రభుత్వం అందించిన యూరియాను పంపిణీ చేశారు. ఎలాంటి గందరగోళం లేకుండా రైతులకు యూరియా సరఫరా చేశామన్నారు. వ్యవసాయ సహయకులు, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా వెంకన్న పవిత్రోత్సవాలు



స్వామి వారికి పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

తంబళ్లపల్లె, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కోసువారిపల్లెలో కొలువైన ప్రసన్న వేంకటరమణ స్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు టీటీడీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహిస్తున్నారు. ఏడాది పొడవునా ఆలయంలో జరిగే అర్చనలు, ఉత్సవాల్లో తెలిసీ, తెలియక కొన్ని దోషాలు జరుగుతుంటాయని వాటి వల్ల ఆలయ ప్రతిష్ఠకు ఎలాంటి లోపం రానీయకుండా ఆగమ శాస్త్రం ప్రకారం పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ దిశంత్ కుమార్ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు కృష్ణ ప్రసాద్ భట్టర్, ఉప ప్రధాన అర్చకులు రమేష్ స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆగమ శాస్త్రం ప్రకారం యాగశాల చతుష్టానార్చన, పవిత్ర ప్రతిష్ఠ, పూర్ణాహుతి అనంతరం స్నపన తిరుమంజనం నిర్వహించారు. భక్తులు పవిత్రోత్సవాల్లో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమాల్లో ఆలయ సిబ్బంది నగేష్, గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు నూతన పరిశోధనలు చేపట్టాలి

ఐఎస్ఎఫ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు టంగుటూరు శివ



సమావేశంలో మాట్లాడుతున్న ఫౌండేషన్ వ్యవస్థాపకులు టంగుటూరు శివ

కురబలకోట, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నూతన ఆవిష్కరణలను చేపట్టి దేశాభివృద్ధికి పాటుపడాలని బెంగళూరు ఐఎస్ఎఫ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు టంగుటూరు శివ, ప్రో-ఛాన్సెలర్ నాదెళ్ళ ద్వారకనాథ్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. డీమ్డ్ టు బీ మిట్స్ యూనివర్సిటీలో మొదటి సంవత్సర ఇంజనీరింగ్ ఎంబీఏ, ఎంసీఏ, ఎంటెక్ విద్యార్థులకు తరగతులను బుధవారం ప్రారంభించారు. ప్రతి విద్యార్థి సాంకేతిక రంగాల్లో నైపుణ్యాలను మెరుగు పరచుకోవడం, ప్రధానంగా సాంకేతికపై దృష్టి సారించాలన్నారు. పరిశ్రమలలో నూతన టెక్నాలజీకి అనుగుణంగా పట్టు సాధించి వ్యాపారవేత్తలుగా ఎదిగితే ఉజ్వల భవిష్యత్తును సాధించవచ్చన్నారు. టెక్నాలజీపై పూర్తి స్థాయిలో నైపుణ్యాలను ప్రదర్శిస్తే మెరుగైన ఉపాధి అవకాశాలను సాధించవచ్చన్నారు. విద్యార్థులు నిర్దిష్ట లక్ష్యంతో ముందుకు సాగి తమ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. విద్యార్థి దశ ఎంతో కీలకమైందన్నారు. కళాశాలలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఇంటర్న్‌షిప్‌లు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళాశాలలో విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని అనేక అవకాశాలు అందుబాటులో ఉన్నాయని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు కళాశాలకు పేరుప్రఖ్యాతులు తీసుకొచ్చి సమాజంలో అందరికీ ఆదర్శవంతంగా నిలవాలన్నారు. వీసీ యువరాజ్, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.